శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త

మంత్రి మూడురోజుల జిల్లాపర్యటన ఖరారు

ఆత్మకూరు, ఏప్రిల్22, ప్రభాతవార్త: రాష్ట్ర దేవాదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి జిల్లాలో మూడు రోజులపాటు విస్తృతంగా పర్యటించనున్నారని, ఈసందర్భంగా పలు కార్యక్రమాల్లో పాల్గొంటారని 23వ తేదీ గురువారం ఉదయం 10గంటలకు ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డితో కలిసి పొదలకూరు మండలం విరువూరు సీతారామస్వామి దేవస్థాన మహ కుంభాభిషేకం లో పాల్గొంటారని, నెల్లూరులో ఐఎబి సమావేశంలో మంత్రి పాల్గొంటారని, 24న ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డితో కలిసి కృష్ణపట్నంలోని శ్రీకామాక్షి సమేత సిద్ధేశ్వర వేణుగోపాలస్వామి ఆలయాన్ని సందర్శించి అధికారులతో సమీక్షాసమావేశం నిర్వహిస్తారని కార్యక్రమాల అనంతరం తిరిగి నెల్లూరుకు చేరుకుంటారని ఏప్రిల్ 25న నెల్లూరులో స్థానికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో పాల్గొంటారని అధికార వర్గాల ద్వారా తెలిసింది.

నెల్లూరు విద్యా చరిత్రలో సరికొత్త రికార్డు

నాడు బిక్షాటన-నేడు ఇంగ్లీష్‌లో ప్రసంగం

ప్రభుత్వ బడిలో గ్రాడ్యుయేషన్ డే 180 మంది చిన్నారులకు పట్టాలు, ఫిదా అయిన కమిషనర్

నెల్లూరు కార్పోరేషన్, ఏప్రిల్ 22 ప్రభాతవార్త : నెల్లూరులోని విఆర్.మున్సిపల్ కార్పోరేషన్ హైస్కూల్ పేద విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి విద్యను ఉచితంగా అందించాలన్న ఆయన సంకల్పం నేడు వందలాది చిన్నారుల జీవితాల్లో వెలుగులు నింపుతోంది. కార్పోరేట్ స్కూళ్ళకు సైతం సవాల్ విసిరేలా ఈ ప్రభుత్వ బడిలోని 180మంది చిన్నారులు మున్సిపల్ కమిషనర్ చేతల మీదుగా పట్టాలు అందుకోవడం నెల్లూరు విద్యా చరిత్రల్లోనే ఒక మైలురాయి మంత్రి నారాయణ ఎంతో ప్రతిష్టాత్మకంగా తీర్చిదిద్దిన ఈ పాఠశాల, మొదటి అకడమిక్ ఈయర్‌లోనే ఊహించని విజయాలను నమోదు చేసింది. గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో పాల్గొన్న మున్సిపల్ కమిషనర్ నందన్ మాట్లాడుతూ మంత్రి నారాయణ చొరవతో ఏర్పాటుచేసిన ఉచిత బస్సు సౌకర్యం, పౌష్టికాహారం, కార్పోరేటర్ టీచర్ల బోధన వల్ల 1065 మంది విద్యార్థులు ఇక్కడ అద్భుతంగా రాణిస్తున్నారని తెలిపారు. ఈసందర్బంగా 180మంది విద్యార్థులు ప్రీగ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లు, మెడల్స్ పంపిణీ చేశారు.

నాడు బిక్షాటన-నేడు ఇంగ్లీష్‌లో అనర్గళంగా మాటలు :

ఒక్కప్పుడు బిక్షాటన చేస్తూ గడిపిన ఓ బాలుడు నేడు ఈ స్కూల్‌లో చేరి ఇంగ్లీష్‌లో అనర్గళంగా మాట్లాడుతుండడం ఒక గొప్ప మార్పు అని కమిషనర్ పేర్కొన్నారు. మంత్రి లోకేష్ స్వయంగా ఆ బాలుడిని అడ్మిషన్ ఇచ్చి చదువు పట్ల అసక్తి కలిగించారని నేడు ఆ విద్యార్థి మూడవ తరగతికి ప్రమోట్ అవ్వడం గర్వకారణమని తెలిపారు. నిష్ణాతులైన టీచర్లు, ఉచిత రవాణా సౌకర్యాలతో నెల్లూలోని వీఆర్ ప్రభుత్వపాఠశాల రాష్ట్రానికి ఆదర్శంగా నిలుస్తోందని కమిషనర్ నందన్ తెలిపారు. హెచ్ఎం చింతాల వెంకటరావు, అడ్మినిస్టేటివ్ ఆఫీసర్ వెంకటరమణ, అసిస్టెంట్ హెచ్ఎం లక్ష్మినారాయణ, టీచర్లు గురుప్రసాద్, జయలక్ష్మి, హరిత, చంద్రకళ, ఎంఈఓ హమీద్ పాఠశాల సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల కరపత్రాలు ఎమ్మెల్యే ఆవిష్కరణ

విడవలూరు, ఏప్రిల్ 22 ప్రభాతవార్త: మండలం పార్లపల్లి గ్రామంలో వెలసియున్న శ్రీ చతుర్భుజ మహాలక్ష్మీ సమేత శ్రీ అలగనాథ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 27 నుంచి మే నెల 3వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్బంగా బ్రహ్మోత్సవాలకు సంబంధించిన కరపత్రాలను కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి నెల్లూరులో ఆవిష్కరించారు. ఈ సందర్బంగా ఆమె మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు సమన్వయంతో ఉత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఉచ్చూరు సుదీప్ రెడ్డి, కార్యనిర్వహణాధికారి మోహన్ కుమార్, మండల ఇంచార్జి అడపాల శ్రీధర్ రెడ్డి, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పులివెందులలో మాజీ సీఎంను కలిసిన మాజీ మంత్రి నల్లపరెడ్డి

కోవూరు, ఏప్రిల్22 ప్రభాతవార్త : వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని బుధవారం పులివెందులలోని వారి నివాసంలో మాజీ మంత్రి, వైసీపీ రాష్ట్ర పీఏసీ సభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్బంగా పార్టీకి సంబంధించిన పలు విషయాలపై ప్రత్యేకంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట కోవూరు నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి వీరి చలపతిరావు ఉన్నారు. అంతకుముందు వీరు మాజీ ముఖ్యమంత్రిని బొకేతో సత్కరించారు.

గ్రీవెన్స్ కార్యక్రమంలో పాల్గొన్న బీద

నెల్లూరు, ఏప్రిల్ 22, ప్రభాతవార్త-వైద్యం మంగళగిరి తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితతో కలిసి శాసనమండలి సభ్యులు, టీడీపీ నెల్లూరు జిల్లా అధ్యక్షులు బీద రవిచంద్ర పాల్గొన్నారు. సంక్షేమ పథకాలు, భూ వివాదాలు, ఆర్థిక వివాదాలు వంటి పలు సమస్యల పరిష్కారం కోరుతూ గ్రీవెన్స్‌కు వచ్చిన ప్రజల నుండి వినతులను బీద రవిచంద్ర స్వీకరించారు. ప్రజలు ఇచ్చిన వినతులను సునిశితంగా పరిశీలించి, వారి అభ్యర్ధనలను, ఆవేదనను విని, ఫోన్ కాల్ ద్వారా పరిష్కారం అయ్యే అవకాశం ఉన్న సమస్యలను అక్కడికక్కడే సంబంధిత అధికారులతో మంత్రి సవితమ్మ, బీద రవిచంద్ర మాట్లాడి పరిష్కరించారు. మరికొన్ని సమస్యలను సంబంధిత అధికారులకు అనుసంధానించి, సాధ్యమైనంత త్వరగా వాటికి పరిష్కారం చూపి బాధితులకు స్వాంతన చేకూర్చాలని బీద రవిచంద్ర కోరారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, యువనేత నారా లోకేష్ ఆదేశాలతో ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ నిర్వహిస్తున్నామని ఈ సందర్బంగా బీద రవిచంద్ర తెలిపారు.

కోటమిట్టలో కార్డెన్ సెర్చ్

- సరైన పత్రాలు లేని 21 ద్విచక్ర వాహనాలు స్వాధీనం

నెల్లూరు క్రైమ్, ఏప్రిల్ 22, ప్రభాతవార్త : జిల్లా ఎస్పీ డా. అజిత వెజెండ్ల జిల్లా పోలీస్ అధికారులకు కార్డన్ సెర్చ్ ఆపరేషన్లపై జారీ చేసిన ఆదేశాల మేరకు, కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్స్‌ను మరింత ప్రభావవంతంగా నిర్వహిస్తూ, ప్రజల్లో సానుకూల భావన కలిగే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. డిజిటల్ మ్యాపింగ్ ద్వారా క్రైమ్ స్పాట్స్ గుర్తింపు, రౌడీషీటర్లు, అనుమానితులు, పరారీ నిందితులు, వారెంట్లు /సమన్లు, గంజాయి ఇతర నిషేధిత పదార్థాలు, వాహనాలు, అక్రమ ఆయుధాలపై ప్రత్యేక దృష్టి సారించబడుతోంది. అందులో భాగంగా బుధవారం నెల్లూరు చిన్న బజార్ పోలీస్ స్టేషన్ పరిధిలో, కోటమిట్ట జంక్షన్ వద్ద, నెల్లూరు వన్‌టౌన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ సిహెచ్.కోటేశ్వరరావు ఆధ్వర్యంలో 45 మంది సిబ్బందితో కూడిన ప్రత్యేక బృందం విస్తృత కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్‌లో భాగంగా సుమారు 300 ఇళ్లను తనిఖీ చేయగా, సరైన పత్రాలు లేని 21 టూవీలర్స్ (బైకులు) గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా అక్కడి ప్రజలకు స్థానిక సమస్యలు, రోడ్డు ప్రమాదాల నివారణ, మహిళలు, బాలల భద్రత, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగం నివారణపై అవగాహన కల్పిస్తూ కౌన్సిలింగ్ నిర్వహించారు. చిన్న బజార్ పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతలను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ఇటువంటి కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్స్‌ను విస్తృతంగా కొనసాగిస్తామని సీఐ కోటేశ్వరరావు తెలిపారు.



మహిళలను ఆర్థికంగా బలోపేతమే చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

- స్వయం సహాయక సంఘాల విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్లకు 1 కోటి 60 లక్షలు విలువ చేసే 185, 5జి స్మార్ట్ ఫోన్ల అందజేత.
- నాడు చంద్రబాబు నాయుడు వేసిన డ్వాక్రా అనే బీజం నేడు మహావృక్షమై కోట్లాది మంది మహిళల జీవితాల్లో వెలుగులు నింపుతోంది.
- 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి స్వయం సహాయక సంఘాలకు రికార్డు స్థాయిలో 291 కోట్ల 7 లక్షల రుణ సహాయాన్ని అందించాం.
- ఇంటికో మహిళా పారిశ్రామికవేత్తను తయారు చేసే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు.
- ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి

కోవూరు, ఏప్రిల్ 22 ప్రభాతవార్త : రాష్ట్రంలో మహిళా సాధికారతకు ఆద్యులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారేనన్నారు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి. కోవూరు పట్టణంలోని పివిఆర్ కళ్యాణ మండపంలో నిర్వహించిన విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్లకు 5జి మొబైల్ ఫోన్ల పంపిణీ కార్యక్రమం అత్యంత వైభవంగా ప్రారంభమైంది. మహిళలకు స్ఫూర్తినిచ్చే వెలుగు ప్రార్థనా గీతంతో మొదలైన కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని 185 మంది విఓఎలకు అధునాతన 5జి స్మార్ట్‌ఫోన్లను అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నాడు ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు వేసిన ద్వాక్రా అనే బీజం నేడు మహావృక్షమై రాష్ట్రంలోని కోట్లాది మంది ఆడబిడ్డల జీవితాల్లో వెలుగులు నింపుతోందని కొనియాడారు. కుటుంబ నిర్వహణ మరియు పొదుపు చేయడంలో మహిళల నేర్పు ఓర్పుల గురించి ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి వివరించారు. మహిళలను ప్రపంచంతో పోటీపడేలా తీర్చిదిద్దిన ఘనత ఆయనకే చంద్రబాబు నాయుడుకే దక్కుతుందన్నారు. కోవూరు నియోజకవర్గ పరిధిలోని కొడవలూరు, విడవలూరు, ఇందుకూరుపేట, కోవూరు, బుచ్చిరెడ్డి పాలెం మండలాలలో 5 వేల 885 స్వయం సహాయక సంఘాల్లోని 59 వేల 460 మంది మహిళా సభ్యులను పారిశ్రామికవేత్తలుగా మార్చడమే తమ ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు. ఇందులో భాగంగానే 202526 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి స్త్రీనిధి, ఉన్నతి, బ్యాంకు లింకేజీ మరియు దినీ వంటి వివిధ పథకాల ద్వారా నియోజకవర్గంలో రికార్డు స్థాయిలో 291 కోట్ల 7 లక్షల రుణ సహాయాన్ని అందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కి ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి కి కోవూరు నియోజకవర్గ ప్రజానీకం తరుపున ధన్యవాదాలు తెలియ చేసారు. చంద్రబాబు నాయుడు డిజిటల్ విజన్‌లో భాగంగానే ఈరోజు వీఓఎలకు 5బి మొబైల్స్ అందజేస్తున్నామని దీనివల్ల క్షేత్రస్థాయిలో విప్లవాత్మక మార్పులు వస్తాయని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి తెలిపారు. ఇకపై రికార్డుల నిర్వహణ కోసం గంటల తరబడి వేచి చూడాల్సిన అవసరం లేదని, హైస్పీడ్ ఇంటర్నెట్‌తో నిమిషాల్లో వివరాలను ఆన్‌లైన్ చేయవచ్చని చెప్పారు. రియల్ టైమ్ మానిటరింగ్ ద్వారా అవినీతికి తావులేకుండా పారదర్శకత పెరుగుతుందని అలాగే మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను ఆన్‌లైన్ మార్కెట్లలో ప్రదర్శించడానికి ఈ ఫోన్లు ఎంతో ఉపయోగపడతాయని వివరించారు. ప్రభుత్వ నిర్ణయాలు మరియు కొత్త జీవోలు వాట్సాప్ లేదా ప్రత్యేక యాప్‌ల ద్వారా నేరుగా సెకన్ల వ్యవధిలో ప్రతి సభ్యురాలికి చేరుతాయని తద్వారా సమాచార లోపం లేకుండా ప్రతి మహిళా సాధికారత సాధనలో భాగస్వామి అవుతుందని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ఆశాభావం వ్యక్తం చేసారు. మారుతున్న కాలానికి అనుగుణంగా మహిళా సంఘాల పనితీరులో వేగం, పారదర్శకత పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం 5బి స్మార్ట్ ఫోన్లు అందచేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందనన్నారు. అనంతరం డిఆర్డిఎ ప్రాజెక్ట్ డైరెక్టర్ నాగరాజ కుమారి మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల పురోగతి వివరించారు. ప్రభుత్వం యిచ్చే రుణాలను సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఎ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్లు మధుసూదన్, మురళి ఎంపీడీఓ శ్రీహరి, కోవూరు నియోజకవర్గ పరిధిలోని ఎపిఎంలు. విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్లతో పాటు స్థానిక టిడిపి, జనసేన, బిజెపి నాయకులు పెద్ద సంఖ్యలో స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ టి. పార్వతి మండల పార్టీ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షుడు మల్లారెడ్డి, పార్టీ సీనియర్ నేతలు వై. వెంకటరమణమ్మ, వెంకటేశ్వర్లు, జహంగీర్, సాయిరెడ్డి, సాయి జయంత్‌రెడ్డి, మదన్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, విన్నకోట రాధాకృష్ణ, ఫిరోజ్‌ఖాన్, అశోక్‌కుమార్, మధుసూదన్‌రావు,,చింతలపూడి పెంచలయ్య, శ్రీనివాసులు నాయుడు, శ్రీనివాసులు, సుబ్బానాయుడు, ఎంపీటీసీ సభ్యులు నాగరాజు, సునీల్‌కుమార్ రెడ్డి, ఆదాల శివారెడ్డి, సుబ్బానాయుడు, బాల రవి, కూటమి నేతలు శ్రీనివాసులురెడ్డి, సుబ్బారావు,, వెలుగు డీపీఎం మధుసూదన్‌రావు, ఏపీఎంలు సుబ్బరాజు, శ్రీధర్, సరిత, కృష్ణవేణి, వెంకమ్మ, సీసీలు తదితరులు ఉన్నారు.

ప్రతి మహిళా ఆర్థికాభివృద్ధి సాధించడమే లక్ష్యం

- పొదుపు విఓఏలకు స్మార్ట్ ఫోన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే సోమిరెడ్డి

ముత్తుకూరు, ఏప్రిల్ 22, ప్రభాతవార్త ప్రతి మహిళా ఆర్థికాభివృద్ధి సాధించడమే లక్ష్యమని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం సర్వేపల్లి నియోజకవర్గం లోని 175 మంది వీఓఏలకు రూ.15 వేలు విలువజేసే మొబైల్ ఫోన్ల పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రూ. 26.25 లక్షలతో ఈ కార్యక్రమం చేపట్టారన్నారు. జిల్లా వ్యాప్తంగా 1073 మందికి 1.61 కోట్లతో సామ్ సంగ్ ఫోన్ల పంపిణీ చేస్తున్నామన్నారు. పొదుపు గ్రూపులను ప్రోత్సహించడంలో 19942004 మధ్య దేశంలోనే చంద్రబాబు నాయుడు రోల్ మోడల్‌గా నిలిచారని కొనియాడారు. సర్వేపల్లిలో 190 గ్రామ సమాఖ్యలు ఉన్నాయని, 6109 స్వయం సహాయక సంఘాల్లో 48681 మంది సభ్యులుగా ఉన్నారన్నారు. 4979 మంది 11 శాతం వడ్డీతో రూ.43.47 కోట్లు స్త్రీనిధి రుణాలు పొందారని తెలిపారు. ఉన్నతి పథకంలో 161 మంది రూ.1.05 కోట్లు వడ్డీ లేని రుణాలు తీసుకున్నారన్నారు. 1886 మంది 12 శాతం వడ్డీతో రూ.271.43 కోట్లు బ్యాంకు లింకేజీ రుణాలు తీసుకునివున్నారు. సామాజిక పెట్టుబడి నిధి కింద 203 మంది 11 శాతం వడ్డీతో రూ.1.50 కోట్ల రుణం పొందారన్నారు. మొత్తంగా రూ. 317.45 కోట్లు రుణాలు తీసుకుని టర్నోవర్ చేస్తున్నారని తెలిపారు. ఈ నిధులను సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని ఆకాంక్షిస్తున్నా అదానీ ఫౌండేషన్ ఆద్వర్యంలో కృష్ణపట్నంలో మహిళల కోసం స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ నడుస్తోందన్నారు. ఉచితంగా కుట్టు శిక్షణ ఇవ్వడంతో పాటు మిషన్లు కూడా అందిస్తున్నారని తెలిపారు. త్వరలోనే కంప్యూటర్ శిక్షణ కూడా ప్రారంభించబోతున్నామన్నారు. సెయిల్ కంపెనీ 1841 మంది విద్యార్థినులకు సైకిళ్ల అందజేసిందన్నారు. రెండో విడతలోనూ సైకిళ్ల పంపిణీ చేపట్టబోతున్నామన్నారు. మాకు సంపూర్ణ సహకారం అందిస్తున్న కంపెనీల ప్రతినిధులందరికీ ధన్యవాదాలు తెలిపారు. మహిళల విషయంలో మేం ప్రత్యేక శద్ధ తీసుకుంటూ ముందుకు సాగుతున్నామన్నారు. దురదృష్టవశాత్తు పార్లమెంటులో విపక్షాలన్నీ కలిసి మహిళా రిజర్వేషన్ బిల్లును కుప్పకూల్చాయన్నారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ఎన్డీఏ కట్టుబడివుందన్నారు. వచ్చే ఎన్నికల లోపు ఆ చట్టాన్ని అమల్లోకి తెస్తుందనే నమ్మకం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు నీలం మల్లికార్జున యాదవ్, ఈదురు రామ్మోహన్ రెడ్డి, తెలుగు యువత మండల అధ్యక్షులు రాగల శివకృష్ణ, మండల అధికారులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సోమశిల నీటిమట్టం



అనంతసాగరం, ఏప్రిల్ 22, ప్రభాతవార్త: మండలంలోని సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి బుధవారం సాయంత్రానికి 0 క్యూ సెక్కుల వంతున వరద ప్రవాహం నమోదైంది. జలాశయం పూర్తిసామర్థ్యం 78 టిఎంసిలు కాగా ప్రస్తుతం జలాశయం లో 58.171టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎస్ఎఫ్‌సికి 0, ఎన్ఎఫ్‌సికి 50, పెన్నా డెల్టా 0 క్యూసెక్కు ల వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 97.738 మీటర్ల మేర నీటిమట్టం నమోదైందని జలాశయం అధికారులు తెలిపారు.

గత ఐదేళ్లలో అభివృద్ధి శూన్యం.. కూటమి పాలనలో అభివృద్ధి పనుల వేగం

- కోవూరులో లో 2. కోట్ల 75 లక్షలతో వోల్టేజీ సమస్యకు చెక్
- రికార్డు స్థాయిలో 56 సి.సి రోడ్ల నిర్మాణం..
- CMRF ద్వారా అనారోగ్య బాధితులకు 72 లక్షల 90 వేల ఆర్థిక సహాయం.
- కోవూరు 3 వ వార్డు పర్యటనలో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి
- ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి

కోవూరు, ఏప్రిల్22 ప్రభాతవార్త : కోవూరు పంచాయతీలోని 3 వ వార్డులో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్బంగా ఆమె ఇంటింటికీ తిరుగుతూ స్థానిక ప్రజలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో మౌలిక సదుపాయాల కల్పనలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి తప్ప, గత ఐదేళ్లలో కోవూరు పట్టణాభివృద్ధి అడుగు కూడా ముందుకు పడలేదని మండిపడ్డారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కేవలం 22 నెలల కాలంలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కోవూరు అభివృద్ధికి భారీగా నిధులు కేటాయించినట్లు ఆమె వివరించారు. గ్రామీణ నీటి సరఫరా విభాగం ద్వారా జల్ జీవన్ మిషన్, స్వచ్ఛ భారత్ మిషన్, జిల్లా పరిషత్ గ్రాంట్ల కింద సుమారు 1 కోట్ల79 లక్షలు వెచ్చించి తాగునీటి సమస్యకు పరిష్కారం చూపామన్నారు. ఎంపీ బీదా మస్తాన్ రావు నిధులు 50 లక్షల రూపాయల ఎంపి లాడ్స్ నిధులతో పీటర్ కెనాల్ వంతెన నిర్మాణం, ఎఫ్.డి.ఆర్ నిధులతో చెరువు కట్టల బలోపేతం, కాలువల పూడికతీత మరియు కల్వర్టుల నిర్మాణం కోసం దాదాపు 1 కోటి 50 కోట్లు ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు. విద్యుత్ సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ లోవోల్టేజీ సమస్య నివారణకు 15 కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్ల మార్పిడి మరియు ఆర్.డి.ఎస్.ఎస్ పనుల కోసం మొత్తం 2 కోట్ల 75 లక్షలు వినియోగించినట్లు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి వివరించారు. పంచాయతీ రాజ్ విభాగం ద్వారా జరిగిన ప్రగతిని వివరిస్తూ.. విలేజ్ హెల్త్ సెంటర్లు, కోర్టు భవనాలు, రీడింగ్ రూమ్ లతో పాటు ఉపాధి హామీ, సాధారణ నిధులతో రికార్డు స్థాయిలో 2 కోట్ల80 లక్షలతో 56 సి.సి రోడ్లను నిర్మించామన్నారు. సామాజిక బాధ్యతగా ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా 61 మంది లబ్దిదారులకు 72 లక్షల 90 వేల విలువైన చెక్కులను అందించినట్లు వెల్లడించారు. కూటమి ప్రభుత్వ హయాంలోనే కోవూరు సమగ్ర అభివృద్ధి సాధ్యమని ప్రజల సమస్యల పరిష్కారమే తమ ప్రథమ కర్తవ్యమని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కోవూరు తెలుగుదేశం, బిజెపి, జనసేన ముఖ్య పాటు నాయకులతో పెద్ద సంఖ్యలో కూటమి పార్టల కార్యకర్తలు పాల్గొన్నారు.

సింగపూర్‌లో ముగిసిన ఏపీ మంత్రుల రెండో రోజు పర్యటన

సుపరిపాలన భవిష్యత్తు నగరాల నిర్మాణంపై క్షేత్రస్థాయి పరిశీలన చేసిన మంత్రుల బృందం..

నెల్లూరు, ఏప్రిల్ 22, ప్రభాతవార్త-వైద్యం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి, సుపరిపాలనే ధ్యేయంగా సింగపూర్‌లో పర్యటిస్తున్న రాష్ట్ర మంత్రుల బృందం రెండో రోజు పర్యటన అత్యంత కీలకమైన అంశాల చుట్టూ సాగింది. పాలనలో జవాబుదారీతనం, అత్యాధునిక నగరాల నిర్మాణం, శాఖల మధ్య సమన్వయం వంటి అంశాలపై మంత్రులు లోతైన అధ్యయనం చేశారు. ముందుగా మంత్రులు నారాయణ, అచ్చెన్నాయుడు, అనిత, బి.సి. జనార్ధన్ రెడ్డి, అనగాని సత్యప్రసాద్, సత్యకుమార్ యాదవ్‌ల బృందం ఇవాళ ఉదయం సింగపూర్ హోం మంత్రి షణ్ముగం గారితో భేటీ అయ్యారు. దేశ ప్రయోజనాలే పరమావధిగా సాగే పాలన (Nation First Governance), రాజకీయ జవాబుదారీతనంపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో మంత్రులు పాల్గొన్నారు. ప్రభుత్వ యంత్రాంగం అంతా ఒకే తాటిపైకి వచ్చి, సమన్వయంతో ప్రజలకు సేవలను ఎలా అందించాలనే అంశంపై చర్చించారు. మధ్యాహ్నం మంత్రుల బృందం ఖిసింగపూర్ సిటీ గ్యాలరీఖిని సందర్శించింది. కేవలం 50 ఏళ్ల కాలంలో సింగపూర్ ఒక చిన్న ద్వీపం నుండి గ్లోబల్ సిటీగా ఎలా రూపాంతరం చెందిందో తెలియజేసే మోడల్స్, భవిష్యత్తు ప్రణాళికలను వారు ఆసక్తిగా గమనించారు. **సింగపూర్ కోఆపరేషన్ ఎంటర్‌ప్రైజ్** ఆధ్వర్యంలో గవర్నెన్స్ ఎక్సలెన్స్ ప్రోగ్రాంపై మంత్రులకు ప్రత్యేక శిక్షణ లభించింది. అలాగే సింగపూర్ ప్రధాని స్ట్రాటజీ గ్రూపులో భాగమైన ఖిసెంటర్ ఫర్ స్ట్రాటజిక్ ఫ్యూచర్స్‌ఖి సంస్థను సందర్శించి, భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను ముందే అంచనా వేసి విధానాలను ఎలా రూపొందించాలో తెలుసుకున్నారు. ఇంకా రెండు రోజు చివరగా నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ సింగపూర్ (NUS Cities) విభాగంలో మంత్రులు పర్యటించారు. ఆధునిక నగరాల అభివృద్ధి, భూ వినియోగం (Land Use Governance), పట్టణ ప్రణాళికలో పాటించాల్సిన దీర్ఘకాలిక వ్యూహాలపై అక్కడి ప్రతినిధులు మంత్రులకు వివరించారూ.

నిషేధిత రసాయనాలతో పండ్ల పండింపుపై కఠిన చర్యలు తప్పవు

- జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు హెచ్చరిక

నెల్లూరు కలెక్టరేట్, ఏప్రిల్ 22, ప్రభాతవార్త ప్రజల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టే విధంగా నిషేధిత రసాయనాలతో పండ్లను కృత్రిమంగా పండించే వారిపై కఠిన చర్యలు తప్పవని జిల్లా జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు హెచ్చరించారు. బుధవారం సాయంత్రం నెల్లూరు కలెక్టరేట్‌లోని శంకరన్ సమావేశ మందిరంలో నగరంలోని పండ్ల వ్యాపారులు, సంబంధిత అధికారులతో జాయింట్ కలెక్టర్ అవగాహన సమావేశం నిర్వహించారు. తొలుత అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ వెంకటేశ్వరరావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మామిడి, అరటి పండ్లను ఏ విధంగా కృత్రిమ పద్ధతుల్లో మగ్గబెట్టాలి, ఎలాంటి పద్ధతుల్లో మగ్గబెట్టకూడదో వివరించారు. జిల్లాలో కార్బయిడ్ ను వ్యాపారులు ఎవరు కూడా వినియోగించకుండా కఠిన చర్యలు తీసుకోవడంతో పూర్తిగా నిషేధించినట్లు చెప్పారు. పండ్ల కృత్రిమ మగ్గింపునకు ఎతిలిన్ గ్యాస్ ఛాంబర్లు, ఎథిలిన్ సాచెట్లను ప్రభుత్వం నిబంధనలు మేరకు వినియోగించాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే జైలు శిక్షతో పాటు 10 లక్షల జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ఈ సందర్బంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ కాల్షియం కార్బైడ్ వంటి నిషేధిత రసాయనాల వినియోగం చట్టవిరుద్ధమని స్పష్టం చేస్తూ, ఇటువంటి చర్యలు ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయని తెలిపారు. పండ్లను సహజంగా లేదా నియంత్రిత ఎథిలిన్ గ్యాస్ పద్ధతిలో మాత్రమే పండించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పండ్ల వ్యాపారులు నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటించి వినియోగదారులకు సురక్షితమైన పండ్లు అందించాల్సిన బాధ్యత ఉందన్నారు. గోదాములు, నిల్వ కేంద్రాల్లో శుభ్రత, భద్రతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. సంబంధిత అధికారులు తరచూ తనిఖీలు నిర్వహించి అక్రమ చర్యలను అరికట్టాలని ఆదేశించారు. ప్రజలు అసహజంగా మెరుస్తున్న లేదా త్వరగా పండినట్లు కనిపించే పండ్లపై అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద పరిస్థితులను వెంటనే అధికారులకు తెలియజేయాలని సూచించారు. ఆరోగ్యకరమైన ఆహారం ఆరోగ్యకరమైన సమాజం లక్ష్యంగా అందరూ కలిసికట్టుగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. పండ్ల కృత్రిమ మగ్గింపు పై పండ్ల వ్యాపారులకు ఉద్యానవన శాస్త్రవేత్తలతో ఒక అవగాహన సదస్సు నిర్వహించాలని ఫుడ్ సేఫ్టీ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ వెంకటేశ్వరరావు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సుబ్బారెడ్డి, తూనికల కొలతల శాఖ అధికారి ఐజాక్, మార్కెటింగ్ శాఖ ఏడి అనిత, ఫుడ్ సేఫ్టీ అధికారులు, పండ్ల వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.

'పేట' దర్గాలో 3వ రోజు హుండీల లెక్కింపు

అనుమసముద్రంపేట, ఏప్రిల్22, ప్రభాతవార్త: మండలకేంద్రమైన ఏఎస్‌పేటలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీఖాజానాయబ్ రసూల్ దర్గా హుండీల లెక్కింపు 3వరోజు రాష్ట్ర వక్ఫ్‌బోర్డ్ అధికారుల సమక్షంలో కొనసాగించారు. 3వరోజు అయిన బుధవారం 3గంటల వరకు జరిగిన లెక్కింపులో హుండీ నెంబర్ 1డి లెక్కించగా 20,89,760రూపాయలు వచ్చాయని, 3 గ్రాముల బంగారం,983గ్రాముల వెండివచ్చాయని నగదును బ్యాంకు అధికారులకు అప్పగించి దర్గా అకౌంట్‌లో జమ చేశారని ఇఒ షేక్ మొహమ్మద్ హుసేన్ తెలిపారు. ప్రస్తుతం 1ఇ హుండీ లెక్కింపు కొనసాగుతుందని,ఈ 3రోజుల లెక్కింపులో 60,32,397 రూపాయలు ఇప్పటివరకు లెక్కించి బ్యాంకులో జమ చేశామని అలాగే ఈమూడు రోజుల్లో 20గ్రాముల బంగారం, 2కేజీల 481గ్రాముల వెండి వచ్చిందన్నారు. మిగతా హుండీలన్నీ పూర్తయ్యేవరకు ఈ లెక్కింపు కొనసాగుతుందని ఇఒ తెలిపారు. అన్ని విధాల జాగ్రత్తలు పాటిస్తూ నిర్వహి స్తున్నామన్నారు. వక్ఫ్‌బోర్డ్ అధికారులు ఆదం షఫి, ఇబ్రహీం, రవూఫ్, మొహమ్మద్‌హుస్సేన్, ఖాజా మొహిద్దీన్, ఇన్స్‌పెక్టర్ ఖుదావన్, అలీబాష, వక్ఫ్‌బోర్డ్ సిబ్బంది , దర్గా సిబ్బంది పాల్గొన్నారు.

వికలాంగుడైన అన్నను బయటకు గెంటేసిన తమ్ముడు

ఆత్మకూరు,ఏప్రిల్22,ప్రభాతవార్త: ఆత్మకూరు మండలంలోని రామస్వామిపల్లి గ్రామంలో బుధవారం వికలాంగుడైన అన్నను బయటకు గెంటేసిన సంఘటన జరిగింది. ఆస్తిలో వాటా అడిగిన వికలాంగుడైన అన్న వెంకటేశ్వర్లును తన తమ్ముడు బయటకు గెంటేశాడు. దాంతో వెంకటేశ్వర్లు తమ్ముడి ఇంటి ముందు తనకు న్యాయం చేయాలంటూ తమ కుటుంబ సభ్యులతో బైఠాయించారు.

గ్రామసభలో 15 అర్జీలు.. సమస్యల పరిష్కారానికి చర్యలు

విడవలూరు,ఏప్రిల్ 22ప్రభాత వార్త:మండలంలోని పార్లపల్లి గ్రామపంచాయతీలో "వన్ మంత్ - వన్ విలేజ్ - ఫోర్ విజిట్" కార్యక్రమంలో భాగంగా మూడోవ గ్రామసభ నిర్వహించారు. ప్రజలకు ప్రభుత్వ సేవలను దగ్గర చేయడం, వారి సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని తహశీల్దార్ కె. చంద్రశేఖర్ తెలిపారు. ఈ గ్రామసభలో రైతుల నుండి మొత్తం 15 అర్జీలు స్వీకరించినట్లు ఆయన చెప్పారు. అందులో 13 అర్జీలు భూమి విస్తీర్ణం తగ్గిన సమస్యలకు సంబంధించినవిగా ఉండగా, మరో 2 మ్యూటేషన్ సమస్యలపై వచ్చినట్లు వివరించారు. వచ్చిన ప్రతి అర్జీని సంబంధిత శాఖ అధికారులతో సమన్వయం చేసుకుని వేగవంతంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా గ్రామస్థుల సమస్యలు త్వరితగతిన పరిష్కారం పొందుతాయని, అధికారులు గ్రామాలకు వచ్చి ప్రజలతో నేరుగా మమేకమవడం వల్ల పారదర్శకత పెరుగుతుందని ఆయన అన్నారు. అలాగే రైతులు తమ సమస్యలను ఎలాంటి సంకోచం లేకుండా గ్రామసభలలో తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ అబ్దుల్ సలాం, వీఆర్వో నిఖిల్ మరియు స్థానిక రైతులు పాల్గొన్నారు.

పంచాయతీ ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండాలి : ప్రత్యేక అధికారి స్ఫూర్తి రెడ్డి

కొడవలూరు,ఏప్రిల్ 22 ప్రభాతవార్త: మండలం నార్త్ రాజుపాలెం పంచాయతీ పరిధిలోని అన్ని గ్రామ వార్డుల్లో చెత్తాచెదారం తొలగించి పరిశుభ్రతను కచ్చితంగా పాటించాలని ప్రత్యేక అధికారి, తహశీల్దార్ కె. స్ఫూర్తి రెడ్డి అధికారులకు సూచించారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. రాత్రి సమయంలో వీధిలైట్ల పనితీరును పరిశీలించి అవసరమైన చోట కొత్త లైట్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. త్రాగునీటి కొళాయిలకు ట్యాపులు అమర్చడం, సైడ్ కాలువల్లో పూడిక తొలగించడం, బ్లీచింగ్ పౌడర్ చల్లడం వంటి చర్యలను వెంటనే చేపట్టాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. గ్రామాల్లో పరిశుభ్రత, మౌలిక వసతుల నిర్వహణపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని ఆమె స్పష్టం చేశారు.

జనగణనకు ప్రజలు సహకరించాలి

కోవూరు, ఏప్రిల్ 22 ప్రభాతవార్త : భారత ప్రభుత్వం చేపట్టే జనగణన ప్రక్రియకు ప్రజలు పూర్తిస్థాయిలో సహకరించాలని ఏఎస్‌వో రామ్మోహన్ అన్నారు. కోవూరు మండలం గంగవరం గ్రామంలో శిక్షణ పూర్తి చేసుకున్న ఎన్యుమరేటర్లకు జనగణన శాంపిల్ సర్వే ఏ విధంగా చేపట్టాలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఎన్యుమరేటర్ వారికి కేటాయించిన ఇళ్ల దగ్గరకు వెళ్లి 33 ప్రశ్నలతో కూడిన విషయాలపై సంబంధిత కుటుంబ యజమానులతో మాట్లాడి వాటిని యాప్‌లో నమోదు చేయాలన్నారు. మూడవ విడత శిక్షణ పూర్తి చేసుకున్న ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లకు జనగణన ఏ విధంగా చేపట్టాలో అనే విషయాలపై అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ మోటివేటర్లు, సూపర్‌వైజర్లు, ఎన్యుమరేటర్లు ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

కోవూరు, ఏప్రిల్22 ప్రభాతవార్త : కోవూరు మండలం ఇనమడుగు గ్రామంలోని అట్ల కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం 8వ పోషణ్ పక్వాడ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నిర్మల ఆధ్వర్యం లో తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు కలిగిన ఆహారాన్ని ఏ విధంగా తయారుచేయాలో విశదీకరించారు. పోషకాహారం తయారు చేసే విషయంలో తండ్రులు కూడా ఇందులో భాగస్వామ్యం కావాల న్నారు. ఇనమడుగు హోమియోపతి వైద్యులు డాక్టర్ కరుణాకర్ మాట్లాడుతూ ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్య అందిస్తున్నారన్నారు. ఇటువంటి మంచి వసతులు ఉన్న కేంద్రా లను తల్లులు ఉపయోగించుకోవాలన్నారు.తల్లిదండ్రులు,గర్భవతులు సమక్షంలో గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ప్రధానో పాధ్యాయులు మల్లికార్జున,అంగన్‌వాడీ కార్యకర్తలు,ఆశాలు ఉన్నారు.

పీఈటీ వెంకటసుబ్బమ్మ చొరవ స్ఫూర్తిదాయకం

కోవూరు, ఏప్రిల్22 ప్రభాతవార్త : కోవూరులోని పీఆర్ఎన్ బాలికోన్నత పాఠశాలలో పీఈటీగా పనిచేస్తూ త్వరలో పదవీ విరమణ చేయనున్న వెంకటసుబ్బమ్మ విద్యార్థులపై ఉన్న ప్రత్యేకమైన అభిమానంతో 20 మంది క్రీడాకారిణులకు క్రీడా సమదుస్తులను సొంత నిధులతో అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయిని సోఫియా కిరణ్మయి మాట్లాడుతూ పాఠశాల విద్యార్థుల పట్ల ఉన్న ప్రత్యేకమైన అభిమానంతో వెంకటసుబ్బమ్మ ప్రత్యేక చొరవ తీసుకుని వారికి వేలాది రూపాయలు వ్యయం చేసే క్రీడా సమదస్తులు అందజేయడం ఇతరులకు స్ఫూర్తిదాయమన్నారు. క్రీడాకారులు కూడా దాత ఇచ్చిన ఈ సమదుస్తులను ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్లు సులోచన, సునీత, స్వాతి, విద్యార్థినులు ఉన్నారు.

14 సంవత్సరాల పైబడిన ప్రతి ఒక్కరూ టీబీ పరీక్షలు చేయించుకోవాలి

కోవూరు, ఏప్రిల్22 ప్రభాతవార్త : కోవూరు మండలంలోని అన్ని గ్రామాల్లో 14 సంవత్సరాలు పైబడిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా టీబీ పరీక్షలు చేయించుకోవాలని కోవూరు టీబీ యూనిట్ సూపర్‌వైజర్ దిలీప్ తెలిపారు. కోవూరు మండలం పోతిరెడ్డిపాలెం సచివాయంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు టీబీకి సంబంధించిన స్కానింగ్ పరీక్షలను నిర్వహిస్తున్నారన్నారు. ఎంపీటీసీ సభ్యులు నాగరాజు మాట్లాడుతూ జొన్నవాడ దేవస్థాన చైర్మన్ తిరుమూరు అశోక్‌రెడ్డి మాట్లాడుతూ సచివాలయంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందని, ఇటువంటి మంచి అవకాశాన్ని ప్రజలు ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నీటి సంఘం ఉపాధ్యక్షుడు తిరుమూరు వెంకట్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి నాయబ్ రసూల్, టీడీపీ నాయకులు ఆదిశేషారెడ్డి, వీరారెడ్డి, సుబ్బరామిరెడ్డి, ఓబుల్‌రెడ్డి, శివప్రసాద్ ఉన్నారు.

మద్యం మత్తులో పురుగులమందు తాగి వ్యక్తి మృతి

అల్లూరు, ఏప్రిల్ 22 ప్రభాతవార్త : అల్లూరు మండలం నార్త్ మోపూరులో భార్య కాపురానికి రాలేదని మనస్థాపంతో కొడవలూరు మండలం గన్నవరం గ్రామానికి చెందిన కొండ పెంచలయ్య(50) మృతి చెందిన సంఘటన చోటు చేసుకొంది. మృతునికి తన బార్యకి మనస్పార్థం వల్ల ఆమె తమ్ముడు ఇంటికి నార్త్ మోపూరుకు రాగా భార్య మరియు కూతురును ఇంటికి తీసుకెళ్ళడానికి ప్రయత్నించగా మనస్థాపానికి గురైన మృతుడు మద్యం మత్తులో పురుగుల మందు కలుపుకొని తాగినాడు. విషయం తెలుసుకొని మృతుని భార్య అతనిని వెంటనే నెల్లూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్సలు పొందుతూ మంగళవారం సాయంత్రం మరణించాడు. అల్లూరు పోలీస్‌స్టేషన్ నందు కేసు నమోఆదు చేసి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బడి ఈడు పిల్లలందరూ బడిలోనే ఉండాలి;జాయింట్ డైరక్టర్ లింగేశ్వరరెడ్డి

కలిగిరి,ఏప్రిల్ 22, ప్రభాతవార్త; కలిగిరి మండలంలోని బడి ఈడు పిల్లలందరూ బడిలోనే ఉండేవిధంగా ప్రతిఒక్కరూ పనిచేయాలని గుంటూరు జోన్ విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరక్టర్ బి. లింగేశ్వరరెడ్డి తెలిపారు.బుధవారం కలిగిరి మండలంలో విద్యాశాఖ జాయింట్‌డైరక్టర్ పర్యటించారు.కలిగిరిలో జడ్పీ హైస్కూల్,ఎపి మోడల్‌స్కూల్ సందర్శించారు.విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులతో సమావేశమైన అధికారి మాట్లాడుతూ ఈసంవత్సరం ఎక్కడా బడిబయట పిల్లలు కానరాకూడదన్నారు. బడిఈడు పిల్లలం దరూ బడిలో ఉండేవిదంగా చూడాలన్నారు. దీనికోసం ఉపాధ్యా యులంద రూకార్యాచరణతో పనిచే యాల న్నారు.పాఠశాలల్లో చదువుతున్న విధ్యార్దులందరూ ప్రభుత్వం నిర్దేశించిన అకాడమిక్ సాండర్స్‌సాదిం చేవిదంగా కృషి చేయాలన్నారు.5సంవత్సరాలు నిండిన విద్యార్దుల కోసం "బడిపిలుస్తుంది"అనేకార్యక్రమాన్ని ఉపాధ్యాయులు సమర్ధ వంతంగా నిర్వహిం చాలన్నారు. కలిగిరి మండల విద్యాశాఖాధికారి గోళ్ల సురేష్,వి,వెంకట లక్ష్మి,శ్రీనివాస్,కావలి ఉపవిద్యాశాఖాధికారి హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం కలిగిన ఆహారం తీసుకోవాలి

కోవూరు, ఏప్రిల్22 ప్రభాతవార్త : గర్భవతులు, బాలింతలు క్రమం తప్పకుండా పౌష్టికాహారం కలిగిన ఆహారాన్ని తప్పక తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుమిత్ర తెలిపారు. కోవూరు మండలం చుండిగుంట అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా గర్భవతులు, బాలింతలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాటాడుతూ ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యను అందిస్తున్నారన్నారు. క్రమం తప్పకుండా వారికి బలవర్థకమైన పౌష్టికాహారం కూడా అందజేస్తున్నారన్నారు. ఇటువంటి మంచి వసతులు కలిగిన కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు ఉన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

పోతిరెడ్డిపాలెం(కోవూరు,) ఏప్రిల్22 ప్రభాతవార్త : కోవూరు,మండలం పోతిరెడ్డిపాలెం గ్రామంలో జొన్నవాడ దేవస్థాన చైర్మన్ తిరుమూరు అశోక్‌రెడ్డి ఆదేశాల మేరకు మజ్జిగ చలివేంద్రం ప్రారంభించడం జరిగిందని ఎంపీటీసీ సభ్యుడు వై. నాగరాజు తెలిపారు. ప్రస్తుతం ఈ ఎండా కాలంలో ఇటువంటి మంచి కార్యక్రమాన్ని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సూచనల మేరకు బుధవారం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అనంతరం చలివేంద్రం ప్రారంభించి మజ్జిగను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కె. మధుసూదన్‌రెడ్డి, వెంకురెడ్డి, రవీంద్రరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, వీరారెడ్డి, సురేంద్రరెడ్డి, శివప్రసాద్ ఆచారి, ఓబుల్‌రెడ్డి, సుబ్బరామిరెడ్డిలు ఉన్నారు.

సెలవలలో లీప్‌యాప్ ద్వారా విద్యాభోదన కొనసాగించాలి

మనుబోలు ఏప్రిల్ 22 ప్రభాతవార్త : సెలవలలో విద్యార్దులు ఎండలకు తిరగకుండా ఇంటివద్దనే లీప్‌యాప్ ద్వారా విద్యాభోదన కొనసాగించాలని ఎంఈఒ నరేష్‌కుమార్ తెలిపారు. ఆయన బుధవారం తన కార్యాలయంలో మాట్లాడుతు అన్ని పాఠశాలలకు రేపు చివరి వర్కింగ్ డే అని చెప్పారు.తిరిగి జూన్ 12 న పాఠశాల యధావిధిగా ఓపెన్ చేస్తామన్నారు. ఈ సెలవలల్లో విద్యార్దులు లీప్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని అందులో వచ్చే ఆయా తరగతికి సంబందించిన విద్యాబోదన కొనసాగించాలన్నారు. ఈ ఏడాది జిఎల్ఎఫ్ వలన విద్యార్దుల అవగాహన శక్తి పెరిగిందన్నారు. గణితంలో నూ సైన్స్ లోను చదవడంలోను రాయటంలోనూ మెరుపద్దారన్నారు. సెలవు దినాలలో విద్యార్దులు ప్రభుత్వ పాఠశాలల వైపు మొగ్గు చూపేలా ప్రధానోపాధ్యాయులు ప్రచారం నిర్వహించాలన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్దులకు ప్రత్యేక శ్రద్ద తీసుకొని బోధన చేయడం వల్ల మెరుగు పడతారన్నారు. మూడు నెలల్లోనే మార్పు తీసుకొని వచ్చే బాద్యత మాది అన్నారు. కాబట్టి మీపిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు.

రఘు నూరు సరాలు పుస్తకావిష్కరణ

నెల్లూరు క్రైమ్, ఏప్రిల్ 22, ప్రభాతవార్త: పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్, రత్నమ్మ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం నెల్లూరు లోని మినీ టౌనుహాలు నందు డాక్టర్ రాచపాళెం రఘు రచించిన రఘు నూరు సరాలు పుస్తకావిష్కరణ ఘనంగా జరిగింది. పద్య కళాపరిషత్ అధ్యక్షులు దివంగత మెట్టు రామచంద్ర ప్రసాద్ స్మారకార్థం ఆయనకు ఈ పుస్తకాన్ని అంకితం చేశారు. ముందుగా మెట్టు రామచంద్ర ప్రసాద్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం దేశనాయకుల, చరిత్రకారుల చిత్రపటాల ప్రదర్శన జరిగింది. ఈ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో సెంట్రల్ జి.ఎస్.టి.అసిస్టెంట్ కమీషనర్ డాక్టర్ సి.హెచ్.ఉషా కిరణ్, నెల్లూరు జిల్లా క్రైం రికార్డ్స్ బ్యూరో సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎన్.రామారావు, పుస్తక సమీక్షకులు డాక్టర్ కె.లక్ష్మి నారాయణ రెడ్డి, ఎ.జయప్రకాశ్, షేక్ రియాజ్ బాషా, మెట్టు స్వరాజ్య లక్ష్మి, ఎన్.బాలరామయ్య నాయుడు, శింగంశెట్టి మురళీమోహన్ రావు, మురళీమోహన్ రాజు, రచయిత డాక్టర్ రాచపాళెం రఘు, కవులు, కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

స్టాక్ మార్కెట్ పెట్టుబడుల పేరుతో పశు వైద్యునికి రూ. 32.60 లక్షలు టోకరా

నెల్లూరు క్రైమ్, ఏప్రిల్ 22, ప్రభాతవార్త: నెల్లూరు నగరం సరస్వతి నగర్‌కు చెందిన ప్రభుత్వ పశు వైద్యుడు డా.పగడాల జయప్రకాష్ సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కుకుని ఏకంగా రూ. 32,60,778 కోల్పోయారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఇండియా వెల్త్ హోరిజాన్ 64 అనే వాట్సాప్ గ్రూపులో గుర్తుతెలియని వ్యక్తులు ఆయన నంబర్‌ను యాడ్ చేశారు. ఆ గ్రూపులో డాక్టర్ రాజీవ్ సింగ్ అనే వ్యక్తి ఆల్ఫా అలయన్స్ అర్బిట్రేజ్ ద్వారా స్టాక్ మార్కెట్‌లో భారీ లాభాలు వస్తాయని, ఇది సెబీ నిబంధనలకు అనుగుణంగా ఉంటుందని నమ్మబలికారు. వారి మాటలు నమ్మిన జయప్రకాష్, మార్క్ అనే అప్లికేషన్‌లో అకౌంట్ తెరిచి మార్చి 16 నుండి ఏప్రిల్ 15వ తేదీ వరకు వివిధ విడతల్లో మొత్తం రూ. 32,60,778 వివిధ బ్యాంకు ఖాతాలకు బదిలీ చేశారు. ఏప్రిల్ 13న తన సొమ్మును విత్ డ్రా చేసుకునేందుకు ప్రయత్నించగా, పర్సనల్ టాక్స్ చెల్లిస్తేనే డబ్బులు వస్తాయని నమ్మించి మరో రూ.5 లక్షలు వసూలు చేశారు. ఎంతకీ డబ్బులు రాకపోవడంతో అనుమానం వచ్చి ఆరా తీయగా, తాను మోసపోయానని గ్రహించిన బాధితుడు ఈ నెల 21న 1930 నంబర్‌కు ఫిర్యాదు చేసి రసీదు పొందారు. అనంతరం దర్గామిట్ట పోలీస్ ఫిర్యాదు చేయగా స్టేషన్ సీఐ కళ్యాణ్ రాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హెల్మెట్ లేకుండా ప్రయాణం చేయరాదు

దగదర్తి, ఏప్రిల్ 22, ప్రభాతవార్త : ఉలవపాళ్ళ జాతీయ రహదారి వద్ద సీఐ ఏ.శివశంకర్ హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడుపుతున్న వారిని ఆపి వారికి పలు సూచనలు చేశారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడపడం వల్ల వచ్చే ప్రమాదాలు గురించి తెలియజేశారు. ఏమైనా జరగరాని ప్రమాదం జరిగితే తమపై ఆధారపడి కుటుంబాలు చిన్నాభిన్న మైపోతాయని, హెల్మెట్ పెట్టుకుని వాహనాలు నడపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై జంపని కుమార్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

సెల్ఫ్ ఎన్నిమరేషన్ హౌస్ హోల్డ్ సర్వేను పరిశీలించిన ఎంఈఓ

ఉదయగిరి, ఏప్రిల్ 22, ప్రభాతవార్త : ప్రభుత్వ ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు బుధవారం ఉదయగిరి మండల విద్యాశాఖాధికారి టి.వెంకటేశ్వర్లు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉదయగిరి నందు ఉపాధ్యాయిని ఉపాధ్యాయులచే సెల్ఫ్ ఎన్నిమరేషన్ హౌస్ హోల్డ్ సర్వేను చేయించారు. ఈ సందర్భంగా విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ 22వ తేదీన విద్యాశాఖ తరుపున రాష్ట్ర ప్రభుత్వ విద్యాశాఖలో పని చేయుచున్న ప్రతి ఒక్కరూ హౌస్ హోల్డ్ సర్వేను తమ సొంతంగా తమ తమ మొబైల్ ఫోన్స్ నందు చేయవలెనని తెలియజేశారు. మండలంలోని విద్యాశాఖలో పని చేయుచున్న ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు తప్పనిసరిగా ఈహౌస్ హోల్డ్ సర్వేను తమ సొంతంగా తమతమ మొబైల్ ఫోన్స్ నందు చేయాలని మండలంలోని అందరూ ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిస్టిక్ ఫీల్డ్ ట్రైనర్ ఎన్నిమరేషన్ హౌస్ హోల్డ్ సర్వే గాజులపల్లి సుబ్బారెడ్డి, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు జిల్లా ఎస్పీచే ప్రత్యేక గ్రీవెన్స్

ఉదయగిరి, ఏప్రిల్ 22, ప్రభాతవార్త : జిల్లా ఎస్పీ అజిత్ వేజెండ్ల ఉదయగిరి సర్కిల్ పోలీసు స్టేషన్ ప్రాంగణ ఆవరణలో బుధవారం సాయంత్రం ఐదు గంటలకు ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు ఉదయగిరి సీఐ వెంకటరావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రానికి ఎంతో దూరంలో ఉన్న ఉదయగిరి ప్రాంతంలో గ్రీవెన్స్ నిర్వహించేందుకు ఎస్పీ వస్తున్నారని సర్కిల్ పరిధిలోని సీతారామపురం, ఉదయగిరి, దుత్తలూరు, వరికుంటపాడు, మండలాల ప్రజలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సీఐ కోరారు.

గండిపాలెం జంక్షన్ వద్ద ప్రమాదం

ఉదయగిరి, ఏప్రిల్ 22, ప్రభాతవార్త : మండల కేంద్రమైన ఉదయగిరిలోని గండిపాలెం జంక్షన్ హైవే వద్ద బుధవారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. మాసాయిపేటకు చెందిన సునీల్ ఉదయగిరి నుంచి తన స్వగ్రామానికి స్కూటర్‌పై వెళ్తుండగా సీతారాంపురం నుంచి దుత్తలూరు వైపు వేగంగా వెళ్తున్న కారు ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. యువకుడికి స్వల్ప గాయాలుకావడంతో ప్రజలందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ జంక్షన్ వద్ద సరైన పద్దతిలో వాహనాల్లో నడిపేటట్లు చూడాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే ప్రమాదాలు జరగకుండా చూడాలని పోలీసు వారిని కోరుతున్నారు.

టెండర్ పక్రియ పూర్తి

వింజమూరు, ఏప్రిల్ 22, ప్రభాతవార్త : వింజమూరు గ్రామ పంచాయతీకి సంబంధించిన లోకల్ టెండర్లను బుధవారం పూర్తి చేసి అర్హులైన వారిని ఎంపిక చేశారు. పంచాయతీ ఈవో కే.రామారావు షీల్డ్ టెండర్లను టెండరు దారులలో ఒకరిచే ఓపెన్ చేయించి పక్రియను పూర్తి చేశారు. పంచాయతీకి సంబంధించి మోటారు మరమ్మత్తులు ఎలక్ట్రికల్ స్పేర్ పార్ట్స్ పీడబ్ల్యూడీ వర్క్‌లకు సంబంధించిన టెండర్లను పరిశీలించి అర్హులైన వారిని ఎంపిక చేశారు. మోటార్ల మరమ్మత్తులు సంబంధించి వీరదిమ్మి వెంకటేశ్వర్‌రెడ్డిని అలాగే ఎలక్ట్రికల్ స్పేర్ పార్ట్స్ సంబంధించి ప్రవంతి ఎలక్ట్రికల్స్ వారిని అలాగే పీడబ్ల్యూడీ పనులకు సంబంధించి దూపిరెడ్డి బుచ్చిరెడ్డిని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఈవో కే.రామారావు మాట్లాడుతూ ప్రస్తుతం వేసవి తాపం ఎక్కువగా ఉన్నందువలన ప్రజలకు నీటి సమస్య రాకూడదని ఉద్దేశంతో ఈ టెండర్లను పిలిపించినట్లు తెలిపారు. ఈ టెండర్లలో అతి తక్కువ ధరల్లో టెండర్ వేసిన వారిని ఎంపిక చేశామని వారు గురువారం నుండి పనులోకి వస్తారన్నారు. ఈ సందర్భంగా వారికి కూడా ఈయన కొన్ని సూచనలు అందజేశారు. పంచాయతీ నియమ నిబంధనల మేరకు టెండర్ దక్కించుకున్న వారు పని చేయాల్సి వస్తుందన్నారు. లేనియెడల శాఖాపరమైన చర్యలు తీసుకోబడతాయని ఆయన తెలిపారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా సమస్యలను అప్పటికప్పుడే పరిష్కరించే విధంగా పని చేయాల్సి ఉంటుందన్నారు. మీ ఆలోచనలో మాకు తక్కువ వస్తున్నాయని లేదా చేయలేమని ఆలోచన ఉండకూడదని ఖచ్చితమైన విధానాలతో పని చేయాలని సూచించారు. అలాగే అందుకు సంబంధించిన ఒప్పంద పత్రాన్ని సమర్పించి పనులు ప్రారంభించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

చేజర్లలలో పోషణ పక్వాడ కార్యక్రమం

చేజర్ల ఏప్రిల్ 22 ప్రభాతవార్తమండలకేంద్రమైన చేజర్లలలో 8వ పోషణ పక్వాడ కార్యక్రమం బుధవారం నిర్వహించడం జరిగింది. ఆత్మకూరు సిడిపిఒ సునీలత ముఖ్య అతిధిగా హాజరైయ్యారు. అనంతరం సిడిపిఒ మాట్లాడుతు పిల్లల యొక్క తల్లిదండ్రులను అంగన్ వాడీ కేంద్రాలలో హాజరు పరచి ప్రస్తుత పరిస్థితులలో తీసుకోవాల్సిన ఆహారంపై అవగాహన కల్పించారు. ఆహార్ని ఏ విధంగా తయారు చేసుకోవాలో సూచించారు. అదే విధంగా పిల్లలు జంక్‌ఫుడ్ లాంటివి కాకుండా కేవలం ఇంట్లో తయారు చేసిన ఆహారాన్ని మాత్రమే ఇవ్వాలని తెలిపారు.గర్భవతులు బాలింతలకు పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ కవర్లు డబ్బాలు,ఆహార నిలువలు కొరకు వాడ కూడదని తెలియజేశారు. అంగన్‌వాడీ కేంద్రాలలో నిర్వహించే ప్రీస్కూల్ 3 నుండి 6 సంవత్సరాల పిల్లలకు లో కాస్ట్ ప్రీ కాస్ట్‌మెటీరియల్ ఉపయోగించి ఆటపాటల ద్వారా విద్యను నేర్పించడం జరుగుతుందని తెలియజేశారు. పిల్లల చే తల్లిదండ్రులకు ప్రీస్కూల్ కార్యక్రమాలు చేయించి చూపించడం జరిగింది.పాలు పండ్లు,గుడ్లు లాంటి పోషకాలు ఉన్నటువంటి ఆహారాన్ని పిల్లలకు ప్రతి రోజు ఇవ్వాలని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలలో పిల్లలకు సంబందించిన ఆట వస్తువులను పలక, సెన్సిల్ తదితర వస్తువులను దాతలు అందజేయడం జరిగింది. ఈకార్యక్రమంలో తెలుగుదేశం పార్టీనాయకులు మాజీ ఎంపిపి రావి పెంచలరెడ్డి, ఎంపిపి తూమాటి విజయ బాస్కర్‌రెడ్డి, సొసైటీ అద్యక్షులు బూదళ్ళ వీరరాఘవరెడ్డి, ఎస్‌సిసెల్ నాయకుడు సోమవరపు హజరత్తయ్య, ఏపిఎం సుజిత, ఏంఈఒ ఇందిరా అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఎం పద్మ, అంగన్‌వాడీ కార్యకర్త వేణుమాదవి, సిబ్బంది పాల్గొన్నారు.

కబడ్డీ విజేత నరసాపురం పాఠశాల

ఇందుకూరుపేట, ఏప్రిల్ 22, ప్రభాతవార్త : ఇందుకూరుపేట మండలం నరసాపురంలోని శ్రీ బాలాజీ విద్యా మందిర్ ప్రైవేటు పాఠశాల ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన మండల స్థాయి కబడ్డీ పోటీలను శనివారం శ్రీ బాలాజీ విద్యా మందిర్‌లోని క్రీడా ప్రాంగణంలో నిర్వహించడం జరిగింది. ఈ క్రీడా కబడ్డీ పోటీలలో నరసాపురంలోని ఎంవీఆర్ఆర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు అన్ని పాఠశాలను ఓడించి కబడ్డీ క్రీడా విజేతగా నిలిచింది. వీరికి ఈ రోజు పాఠశాలలో అభినందన సభను నిర్వహించి విజేత అయిన విద్యార్థులను, రాష్ట్ర ఉత్తమ వ్యాయామ ఉపాధ్యాయులు అయిన షేక్ ముజీర్‌కి అభినందనలు తెలిపారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.నాగేశ్వరరావు, పాఠశాల చైర్మన్ శ్రీనివాసులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా జెమ్స్ పాఠశాల వార్షికోత్సవ వేడుకలు

రాపూరు, ఏప్రిల్ 22, ప్రభాతవార్త : మండల కేంద్రమైన రాపూరులోని జెమ్స్ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో బుదవారం వార్షికోత్సవ వేడుకలు, అవార్డులు ప్రధానోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇందులో బాగంగా పాఠశాల కరస్పాండెంట్ బులగాకుల మునీంద్రా రెడ్డి మాట్లాడుతూ జూన్ నుండి ఏప్రిల్ వరకు పాఠశాలలో జరిగిన విద్యా, క్రీడా, సాస్కృతిక కార్యక్రమాలలో విద్యార్థుల ప్రతిభను గుర్తించి వారిని ప్రోత్సహించడమే జెమ్స్ మహోత్సవ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. విద్యా విభాగంతో పాటు కో కరిక్యులర్ యాక్టివిటీస్, స్పోర్ట్స్ మీట్ మరియు ఒలింపియాడ్ కార్యక్రమాలలో అత్యుత్తమ్మ ప్రతిభ కనపరిచిన విద్యార్థులు ఈ సందర్భంగా అవార్డులు అందజేశారు. యూకేజీ పూర్తి చేసుకోని ఒకటో తరగతిలోకి ప్రవేశిస్తున్న చిన్నారులకు, ఐదవ తరగతి పూర్తి చేసుకోని ఆరో తరగతిలోకి అడుగుపెడుతున్న విద్యార్థులకు ప్రత్యేకంగా గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. విద్యార్థుల అద్భుత ప్రదర్శన, ఉపాధ్యాయుల కృషి తల్లితండ్రుల సహకారాం వల్లే ఈ వార్షికోత్సవ వేడుకలు విజయవంతం అయినట్లు ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కేతా అమర్నాథ్ రెడ్డి, పాఠశాల పౌండర్ కేతా జనార్ధన్ రెడ్డి, అంధ్రప్రదేశ్ ఈ అభ్యాస్ సిఇఒ సాయి రామకృష్ణ, జెమ్స్ స్కూల్ విద్యా సంస్థ అధ్యాపకులు తదితరలు పాల్గొన్నారు.



రాపూరులో రూ.14,37,536 సీయంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

రాపూరు, ఏప్రిల్ 22, ప్రభాతవార్త : మండల ంలోని పలువురు లబ్ధిదారులకు రూ. 14,37,536 ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పంపిణీ చేశారు. బుదవారం రాపూరు లోని తెలుగుగంగ అతిధిగృహంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే రామకృష్ణ మాట్లాడు తూ గతంలో ఆరోగ్యం బాగలేక ఆసుపత్రిలలో చికిత్స చేయించుకున్న వారికి ముఖ్యమంత్రి సహాయనిధి నుండి ఒక్క రూపాయి కూడా ఇచ్చే వారు కాదన్నారు. ప్రస్తుతం రాష్ట ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రజలు ఏ కార్పోరేట్ ఆసుపత్రిలో చికిత్స పొందినా వారికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా సహాయం చేస్తున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా మండలంలోని 8 మంది లబ్ధిదారుకలు రూ.14,37,536 చెక్కులను ఆయన నాయకులతో కలసి పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో రాపూరు సొసైటీ అధ్యక్షుడు దందోలు వెంకటేశ్వర రెడ్డి,రాష్ట ఎస్‌సీ సెల్ కార్యదర్శి పచ్చిగళ్ళ రత్నం, తిరుపతి పార్లమెంట్ వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి టి.ప్రసాద్ నాయుడు, తిరుపతి పార్లమెంట్ మైనారిటీ ఉపాధ్యక్షుడు ముక్తియార్, రాపూరు మండల ప్రధాన కార్యదర్శి మూరంరెడ్డి మధుసూధన్ రెడ్డి, సహాయ కార్యదర్శి పఠాన్ ఖాన్ బాషా, మూరంరెడ్డి వినయ్ కుమార్ రెడ్డి, గోర్ల వెంకటేశ్వర్లు, సమయం ప్రసాద్, కోటి నాయుడు, పరంధామి రెడ్డి, పుల్లయ్య, రమేష్, కూనిపోగు కన్నయ్య, సియంఆర్ఎఫ్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

పేదలకు పాదరక్షలు పంపిణీ

గూడూరు, ఏప్రిల్ 22, ప్రభాతవార్త : గూడూరు రెండవ పట్టణంలోని మాలవ్య నగర్ సెంటర్లో బుధవారం స్ఫూర్తి సేవా సమితి ఆధ్వర్యంలో ఆ సంస్థ ట్రెజరర్ పురుషోత్తం రాజు తల్లిదండ్రులైన రామకృష్ణంరాజు రుక్మిణమ్మల జ్ఞాపకార్థం ఎండలు ఎక్కువగా ఉన్నందున పేదలకు పాదరక్షలు (చెప్పులు) మరియు చల్లదనం కోసం మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్ఫూర్తి సేవా సమితి అధ్యక్షులు డి. దామోదర్ రాజు మాట్లాడుతూ పేదలకు ఉపయోగపడే అనేక సేవా కార్యక్రమాలను స్ఫూర్తి సేవా సమితి ద్వారా నిర్విరామంగా నిర్వహించడం జరుగుతుందని, ఉష్ణోగ్రతలు తీవ్రంగా ఉన్నందున పేదలకు పాదరక్షలు, మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేయడం జరిగిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి ఎన్.బాలకృష్ణం రాజు, ప్రముఖ చారిటెట్ అకౌంటెంట్ కంటి రామ్మోహనరావు, మండ్ల రాజేష్, ఎం.లక్ష్మీనారాయణ, ఎం.వి నరసరాజు, సుధాకర్ రాజు, సురేంద్ర రాజు, పురుషోత్తం రాజు, కె.వి. కృష్ణంరాజు, కోదండపాణి, నారాయణరాజు, వెంకటరమణ రాజు, సుబ్రహ్మణ్యం రాజు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కంకణాల జన్మదిన వేడుకలు

గూడూరు, ఏప్రిల్ 22, ప్రభాతవార్త : గూడూరును జిల్లా చేయాలని గత 142 రోజులుగా గాంధీ బొమ్మ సెంటర్లో ఏర్పాటు చేసిన శిబిరం వద్దకు గూడూరు ప్రజలు తండోపతండాలుగా వచ్చి సంఘీభావం తెలిపారు. అదే విధంగా గూడూరు జిల్లా పోరాట సమితి నాయకులు కంకణాల పెంచల్ నాయుడు పుట్టిన రోజు సందర్భంగా పేదలకు గొడుగులు పంపిణీ చేసి, కేకు కటింగ్ చేసారు. ఈ కార్యక్రమంలో యారం వెంకట సుబ్బయ్య, మంజులమ్మ, శ్రీగౌరి, పంటా, శ్రీనివాసులు రెడ్డి, చంద్రశేఖర్, అళగర్, కనగలూరు శేఖర్, శేఖర్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

అక్రమణదారుడు నుండి మాకు న్యాయం చేయండి ఇతర లబ్ధిదారులు

తోటపల్లి గూడూరు, ఏప్రిల్ 22, ప్రభాతవార్త : మండలంలోని వెంకన్నపాలెం పంచాయతీ పరిధిలో ఉన్న హౌసింగ్ కాలనీలో భూమి వివాదం తీవ్ర ఉద్రిక్తతలకు దారితీస్తోంది. ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేసిన ఈ కాలనీలో ప్రతి లబ్ధిదారునికి సుమారు 9 గజాల చొప్పున స్థలం కేటాయించగా, ప్రస్తుతం ఒక లబ్ధిదారుడి దౌర్జన్యం కారణంగా ఇతరులకు న్యాయం దూరమవుతోంది. ప్లాట్ నంబర్ 42కు చెందిన లబ్ధిదారుడు పక్కనున్న ప్లాట్ నంబర్ 43లో కొంత భాగాన్ని ఆక్రమించడమే కాకుండా, కాలనీ రోడ్డును సైతం కబ్జా చేసినట్లు బాధితులు తీవ్రంగా ఆరోపిస్తున్నారు. ఇదే కాకుండా ప్లాట్ నంబర్ 40, 41 లబ్ధిదారులను తమ తమ స్థలాల్లోకి రానివ్వకుండా అడ్డుకుంటూ, బెదిరింపులకు గురిచేస్తున్నట్లు వారు వాపోతున్నారు. స్థలంలోకి వెళ్లే ప్రయత్నం చేసినప్పుడల్లా దౌర్జన్యంగా ప్రవర్తిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని బాధితులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో బాధితులు పలుమార్లు రెవెన్యూ అధికారులను ఆశ్రయించినప్పటికీ, అధికారులు ఒకరిపై ఒకరు బాధ్యతలు నెట్టుకుంటూ సమస్యను పరిష్కరించడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయంపై స్థానిక రెవెన్యూ అధికారిని సంప్రదించగా, సర్వే నిర్వహించేందుకు వెళ్లినప్పుడు ప్లాట్ నంబర్ 42 లబ్ధిదారుడు కిరోసిన్ పోసుకుని ఆత్మహత్య చేసుకుంటానని బెదిరిస్తున్నాడు. ఆ కారణంగా సర్వే నిలిచి పోయింది. ఈ విషయాన్ని తాసిల్దార్ దృష్టికి తీసుకెళ్లాం. పోలీస్ రక్షణతో సర్వే నిర్వహించి నిజానిజాలు తేల్చుతాం. ఆక్రమణ నిర్ధారణైతే ఖచ్చితంగా తొలగిస్తాం అని తెలిపారు. అయితే అధికారుల ఈ వివరణపై బాధితులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఒకరి బెదిరింపులకు ప్రభుత్వం, అధికారులు లొంగిపోవడం దారుణం. మాకు కేటాయించిన స్థలాలను చూపించకపోతే మా ఇళ్ల నిర్మాణం ఎలా ప్రారంభించాలి అని ప్రశ్నిస్తున్నారు. లబ్ధిదారులను భయభ్రాంతులకు గురిచేస్తూ అక్రమంగా దౌర్జన్యం చేస్తున్న ఆక్రమణదారుడిపై వెంటనే కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. చట్టాన్ని ధిక్కరిస్తూ బెదిరింపులతో వ్యవహరిస్తున్న వ్యక్తిపై పోలీసులు తక్షణమే జోక్యం చేసుకుని కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని బాధితులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ మరియు పోలీస్ శాఖలు సమన్వయంతో ముందుకు వచ్చి, పోలీస్ రక్షణ మధ్య వెంటనే సర్వే నిర్వహించి ఆక్రమణలను తొలగించి బాధితులకు న్యాయం చేయాలని స్థానికులు కోరుతున్నారు. ముఖ్యంగా తాసిల్దార్ తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

ప్రభుత్వ ఎన్.డి.ఆర్ జూనియర్ కళాశాలలో ఉత్సాహభరిత కార్యక్రమం

తోటపల్లి గూడూరు, ఏప్రిల్ 22, ప్రభాతవార్త : మండల కేంద్రంలోని నాయుడు దశరథరామిరెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ప్రతిభావంతులైన విద్యార్థులకు ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. నాయుడు నాగేశ్వరమ్మ ట్రస్ట్, ఎన్డీఆర్ సంస్థల అధినేత నాయుడు ఆదికేశవుల రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఇంటర్ సీనియర్ ఎంపీసీ, సీఈసీ విభాగాల్లో అత్యధిక మార్కులు సాధించిన ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థాయి విద్యార్థులను సత్కరించి అభినందించారు. సీనియర్ ఎంపీసీ విభాగంలో ఎం.సుప్రజ 958 మార్కులతో ప్రథమ స్థానం, బి. సుచరిత 943 మార్కులతో ద్వితీయ స్థానం, వి. హేమలత 930 మార్కులతో తృతీయ స్థానం సాధించారు. అదే విధంగా సీనియర్ సీఈసీ విభాగంలో కె. ఆశా 778 మార్కులతో ప్రథమ స్థానం, కే. మధుప్రియ 750 మార్కులతో ద్వితీయ స్థానం, పూజిత 690 మార్కులతో తృతీయ స్థానం దక్కించుకున్నారు. ఇతర గ్రూపుల్లో కూడా మంచి మార్కులు సాధించిన విద్యార్థులను సన్మానించారు.కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయుడు ఆదికేశవుల రెడ్డి మాట్లాడుతూ కళాశాలలో కార్పొరేట్ స్థాయిలో ఉత్తమ ఫలితాలు రావడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఫలితాల సాధనలో కృషి చేసిన ఉపాధ్యాయులు, సిబ్బందిని అభినందించారు. కళాశాలలో బైపీసీ గ్రూప్ ప్రారంభం విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. కళాశాల అభివృద్ధికి రూ.64 లక్షల మ్యాచింగ్ గ్రాంట్ అందించినట్లు పేర్కొంటూ, ప్రభుత్వం నుంచి నిధులు లభించిన వెంటనే ప్రహరీ గోడ, అదనపు గదుల నిర్మాణం వంటి మౌలిక వసతులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కృష్ణ ప్రసాద్, నాయుడు వెంకట నర్సారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాహనాలు తనిఖీ చేపట్టిన అల్లూరు ఎస్ఐ

అల్లూరు, ఏప్రిల్ 22 ప్రభాతవార్త : అల్లూరు పాత బస్టాండ్ సెంటర్లో పలు వాహనాలను బుధవారం అల్లూరు ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి తనిఖీ చేపట్టారు. రోడ్డుపై వెలుతున్న ద్విచక్రవాహనాలను ఆపి సరైన పత్రాలు లేని వాటికి, హెల్మెట్ ధరించని వారికి సూరు పది వాహనాలకు ఫైన్లు వేశారు. అనంతరం హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ఉపయోగాలను వాహ నదారులకు వివరించారు. పోలీస్ సిబ్బంది పాల్గొ న్నారు.

ప్రకృతిని పరిరక్షించి భూమిని కాపాడుకుందాం

కావలి, ఏప్రిల్ 22 ప్రభాతవార్త : ప్రకృతిని పరిరక్షించుకొని భూమిని కాపాడుకుందాం అని స్థానిక జనతా పేట బిఓఐ బ్రాంచ్ మేనేజర్ ఎస్. ప్రియాంక పేర్కొన్నారు. వెంగళరావు నగర్‌లోని గిరిజన సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో బుధవారం ధరిత్రి దినోత్సవం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రియాంక పాల్గొని పాఠశాల అవరణంలో మొక్కలు నాటి మాట్లాడారు. భూమిని రక్షించుకొని ప్లాస్టిక్ కవర్లను, ప్లాస్టిక్ వస్తువులను నియంత్రించి పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. మరో అతిథి లోక్అదాలత్ సభ్యులు ఎం.మాలకొండారెడ్డి మాట్లాడుతూ పుడమిపై ప్రతి జీవికి జీవించే హక్కు ఉన్నదని, కానీ మనిషికి మాత్రమే దానిని కాపాడుకునే బాధ్యత కూడా ఉందని తెలిపారు. ప్రిన్సిపాల్ నరేంద్ర శ్యామ్ సుధాకర్ అధ్యక్షత వహించి మాట్లాడారు మితిమీరిన రసాయనక ఎరువులు పంటలపై వినియోగించి భూసారాన్ని కాపాడుకోవాలని, విరివిగా మొక్కలు నాటాలని కోరారు.పాఠశాల భధన సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సర్వాయపాలెం జడ్పిపాఠశాలలో ఘనంగా సమీర్‌కు వీడ్కోలు

కావలి, ఏప్రిల్ 22 ప్రభాతవార్త : మండలంలోని సర్వాయపాలెం జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం తోట వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఆఫీస్ సబార్డినేటర్‌గా విధులు నిర్వహిస్తున్న మీర్జా సమీర్ టైపిస్టుగా పదోన్నతి పొంది బోగోలు ఎండిఓ కార్యాలయంకు బదిలీ అయిన సందర్భంగా బుధవారం పాటశాల ఆవరణంలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధిలో సమీర్ చేసిన సేవలు ఎంతో విలువైనవని తెలిపారు. అనంతరం సమీర్‌కు శాలువాకప్పి పూలమాలలతో సన్మానించి, జ్ఞాపికను అందజేశారు. అనంతరం సమీర్ మాట్లాడుతూ తనకు సహకరించిన హెచ్ఎంలకు, ఉపాధ్యాయులకు, బోధనేతర సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయులు పిరమేష్, రాములు, సిహెచ్ చెంచయ్య, పి.సువర్ణలక్ష్మి, శివరామయ్య, యు.విజయలక్ష్మి, ఎం.అరుణకుమారి, ఫిరోజ్‌ఖాన్, జి.అనిత వి.సరళ కెవి.రత్నం, డి.సుబ్బారావు, సిహెచ్.అన్నపూర్ణ మదు బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

దేశ భవిష్యత్తు యువతరం చేతిలో ఉంది : సిఐ గంగాధర్

ఆత్మకూరు, ఏప్రిల్22,ప్రభాతవార్త: సమాజంలో చెడు వ్యసనాలు దేశ భవిష్యత్తుకు అడ్డంకిగా మారిందని , యువత వ్యసనాలకు బాలినలయితే అదివ వారి కుటుంబంతోపాటు దేశ అభివృద్ధిని చిన్నాభిన్నం చేస్తుందని సిఐ గంగాధర్ తెలిపారు. మాదకద్రవ్యాలను అరికట్టడం అసాంఘిక కార్యక్రమాలు నిరోధించడం పై బుధవారం ఆత్మకూరు పట్టణంలోని నెల్లూరుపాళెంలో సమీపంలోని ఆంధ్ర ఇంజనీరింగ్ కాలేజీ ప్రాంగణంలో కాలేజీ విద్యార్థులతో ప్రమాణం చేయించారు. మొదట కాలేజీ ప్రాంగణం వద్ద విద్యార్థులు ఉపాధ్యాయులతో కలసి జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు.అనంతరం సిఐ గంగాధర్ మాట్లాడుతూ మాదకద్రవ్యాలను, గంజాయి, డ్రగ్స్ వలన సమాజంలో ఎదురవుతున్న ఇబ్బందులను వాటి ప్రభావంతో చెడిపోతున్న యువత భవిష్యత్తు గురించి వివరించారు. అనంతరం దేశ భవిష్యత్తు కోసం తల్లిదండ్రుల గౌరవం కోసం మత్తు పదార్థాలు ఇతర చెడు వ్యసనాల జోలికి వెళ్లనని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈకార్యక్రమంలో ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్స్‌పాల్ గోవర్ధన్, మండల సిసి విజయలక్ష్మి, ఇస్వాస్ సంస్థ అధ్యక్షుడు శేషాద్రి , కాలేజీ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తిప్ప పోరంబోకు ఇళ్ళకు పట్టాలు ఇవ్వాలి

ఆత్మకూరు,ఏప్రిల్22,ప్రభాతవార్త: తిప్ప పోరంబోకు స్థలాల్లో ఇళ్ళు నిర్మించుకున్న నిరుపేదలకు వెంటనే పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో బుధవారం ఆత్మకూరులో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. స్థానిక మున్సిపల్ బస్టాండ్ నుండి ఆర్‌డిఓ కార్యాలయం వరకు సాగిన ఈర్యాలీలో పెద్దఎత్తున ప్రజలు పాల్గొని ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో హోరెత్తించారు. పట్టణంలోని 12నుంచి19వరకు గల వివిధ వార్డుల్లో ఎస్సీ,ఎస్టీ,బిసి, మైనార్టీ వర్గాలకు చెందిన ర్రజలు దశాబ్దాలుగా తిప్ప పోరంబోకు భూముల్లో నివాసం ఉంటున్నారు. వీరందరికి ప్రభుత్వం తక్షణమే ఇంటి పట్టాలు మంజూరు చేయాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. నిబంధనల ప్రకారం కాలనీలకు 50రూపాయలు మాత్రమే ఇంటిపన్ను వసూలు చేయాల్సి ఉండగా మున్సిపల్ అధికారులు ఒక్కో ఇంటికి 3వేలనుండి 4వేల వరకు వసూలు చేస్తున్నారని నేతలు మండిపడ్డారు. ఆత్మకూరు గ్రేడ్-3 మున్సిపాల్టీ అయినప్పటికీ అధికారులు మాత్రం గ్రేడ్1 స్థాయి పన్నులను అక్రమంగా వసూలు చేస్తున్నారని ఆరోపించారు. పన్నులు కట్టించుకోవడానికి లేని అభ్యంతరం పట్టాలు ఇవ్వడానికి వచ్చేసరికి వాగుపోరంబోకుఅంటూ కొర్రులు పెట్టడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. పేద ప్రజలను వేధించడం మానుకోవాలని , పన్నులు వసూలు చేసేటప్పుడు లేని నిబంధనలు పట్టాలు అడిగితేనే ఎందుకు గుర్తుకొస్తున్నాయని వెంటనే అర్హులైన ప్రతి ఒక్కరికి పట్టాలు ఇవ్వాలని లేని పక్షంలో పోరాటాన్ని ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అనంతరం సిపిఎం నాయకులు ఆర్‌డిఓను కలిసి తమ డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈకార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి డేవిడ్‌రాజ్, సిఐటియు జిల్లా నాయకులు జి.శివప్రసాద్, సిపిఎం కమిటీ సభ్యులు నాగయ్య, నాగేంద్ర, గుల్జార్, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

గృహ నిర్మాణ శాఖలో అవినీతి లెక్కలు తేల్చండి

నెల్లూరు అగ్రికల్చర్, ఏప్రిల్ 22, ప్రభాతవార్త : గాంధీ పుట్టిన దేశంలో సమసమాజ స్థాపనకు భంగం వాటిల్లుతోందని, పేదల సొంతింటి కల, కలగానే మిగిలిపోతున్నందుకు నిరసనగా, భారతీయ జనతా పార్టీ నేత మిడతల రమేష్ బుధవారం నెల్లూరు హౌసింగ్ కార్పొరేషన్ కార్యాలయంలో ఉన్న గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో గృహ నిర్మాణ శాఖలో అవినీతికి అంతే లేకుండా పోయిందని, సమసమాజ స్థాపనకు విఘాతం కలుగుతోందని, నెల్లూరు జిల్లాలో అధికారుల తీరుకు నిరసనగా గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేసి నిరసన తెలిపామన్నారు. రాష్ట్రంలో 86,991 గృహాలు, నెల్లూరు జిల్లాలో 4233 గృహాలు, తిరుపతిలో 4055 గృహాలు ఆన్‌లైన్‌లో పూర్తి అయినట్లు, పేదలకు ఇళ్లు అందించినట్లు అధికారులు లెక్కలు చూపుతున్నారని చెప్పారు. ఇవేవీ నివసించేందుకు వీలుగా లేవని తెలిపారు. ఇలాంటి చర్యల కారణంగా దేశ ప్రధాని నరేంద్ర మోడీ లక్ష్యానికి తూట్లు పడుతున్నాయని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే పేదలకు నాణ్యమైన గృహాలు నిర్మిస్తామని, అవినీతి అంతు చూస్తామని చెప్పిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదన్నారు. వాస్తవ రూపంలో అవినీతిలో భాగస్వాములుగా ఉన్న, ఉన్నత స్థాయి అధికారులను రక్షించి అవినీతిని కప్పిపుచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ఇల్లు లేని ప్రతి ఒక్కరికి గృహ నిర్మాణ శాఖ, అవినీతికి తావులేని విధంగా అందరికి ఇళ్లు నిర్మించేందుకు ప్రయత్నాలు సాగించాలని విజ్ఞప్తి చేశారు.

రెడ్ క్రాస్‌లో తలసేమియా ఉచిత వైద్య శిబిరం

నెల్లూరు, ఏప్రిల్ 22, ప్రభాతవార్త-వైద్యం : ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నెల్లూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెడ్ క్రాస్ తలసేమియా కేర్ సెంటర్‌లో బుధవారం తలసేమియాతో బాధపడుతున్న 150 మంది చిన్నారులకు ఎంజీఎం క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ చెన్నై వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరాన్ని రెడ్‌క్రాస్ చైర్మన్ వాకాటి విజయ కుమార్‌రెడ్డి ప్రారంబించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్ఎల్ఏ టెస్ట్‌ల ద్వారా కుటుంబ సభ్యుల యొక్క బోన్ మ్యారో మ్యాచ్ అయితే బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్‌ను దాతల సహకారంతో చిన్నారులకు చేయడానికి రెడ్ క్రాస్ ప్రయత్నించడం జరుగుతుందని తెలిపారు. తలసేమియా పిల్లలకు బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ పూర్తి చేసి వారిని సంపూర్ణ ఆరోగ్యవంతులుగా చేయడానికి రెడ్‌క్రాస్ తప్పకుండా ప్రయత్నిస్తుందని తెలియజేశారు. అనంతరం తలసేమియా ఎగ్జిక్యూటీవ్ మెంబర్ డాక్టర్ హరిత మాట్లాడుతూ వివాహమునకు ముందు కొన్ని జాగ్రత్తలు వహించినచో పుట్టబోయే బిడ్డలకు తలసీమియా రాకుండా చూసుకోవచ్చు. దీనికి సంబంధించి పెళ్లి విషయంలో అమ్మాయికి,అబ్బాయికి కొన్ని రక్త పరీక్షలుచేయడం ద్వారా పుట్టబోయే బిడ్డలకు తలసేమియా రాకుండా చూడవచ్చు అని తెలియజేశారు. అనంతరం ఎంజీఎం క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ వారి వైద్య బృందం డాక్టర్ రిషబ్ భారద్వాజ్, పీడియాట్రిక్ హేమనోంకాలజిస్ట్, డాక్టర్ దీనదయాలన్ హెచ్ఓడీ ఆఫన పీడియాట్రిక్ హేమనోంకాలజిస్ట్ అండ్ బ్లడ్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్, డిప్యూటీ జనరల్ మేనేజర్ హేమ కుమార్ వారు మాట్లాడుతూ ఈ రోజు తీసిన శాంపిల్స్‌ని జర్మనీ ల్యాబ్‌కు పంపించి పరీక్షలు చేయడం జరుగుతుంది. ఫలితాలు రావడానికి 3 నెలల సమయం పడుతుందని తెలిపారు.రెడ్‌క్రాస్ బ్లడ్ సెంటర్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ యశోవర్ధన్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వర ప్రసాద్, సెక్రటరీ పి.మస్తానయ్య, సేవా ఎగ్జిక్యూటీవ్ మెంబర్ షేక్ పర్వీన్ స్వప్న, వందన, రెడ్ క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.



రవి హైస్కూల్లో మిన్నింటిన వార్షికోత్సవ సంబరాలు

వింజమూరు, ఏప్రిల్ 22, ప్రభాతవార్త : వింజమూరు పట్టణంలోని స్థానిక రవి హైస్కూల్లో వార్షికోత్సవ సంబరాలు మిన్నంటాయి. ఈ సంబరాలకు ముఖ్య అతిధులుగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆయన సతీమణి కాకర్ల ప్రవీణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఎమ్మెల్యే దంపతులను, అతిథులను పాఠశాల కరస్పాండెంట్ నూతలపాటి మహేశ్వరరావు గుండా శ్రీనివాసులు, జక్కం మోహన్‌రెడ్డి పాఠశాల ప్రధానోపాధ్యాయులు మన్నేపల్లి పెంచలయ్య విద్యార్థినీ, విద్యార్థులతో కలిసి ఆహ్వానించారు. ముందుగా ఎమ్మెల్యే దంపతులు జ్యోతి ప్రజ్వలన కార్యక్రమాలను ప్రారంభించారు. వార్షికోత్సవ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను కట్టిపడేశాయి. విద్యార్థుల నృత్య ప్రదర్శనలు గీతాలాపనలు వారిలోని సృజనాత్మకతను ప్రతిభను చాటి చెప్పాయి. చిన్నారులకు క్రమశిక్షణ ప్రదర్శనలో వారు చూపిన ఆత్మవిశ్వాసం తల్లిదండ్రులను ఉపాధ్యాయులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ రవి స్కూల్ యాజమాన్యం గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అతి తక్కువ ఖర్చుతో నాణ్యమైన విద్యను అందిస్తూ వారిని భావి భారత పౌరులుగా తీర్చిదిద్దడం అభినందనీయమన్నారు. కేవలం పుస్తక పటనమే కాకుండా విద్యార్థుల్లో నైతిక విలువలు సామాజిక బాధ్యతను పెంపొందించడం ద్వారానే వారి భవిష్యత్తు సుస్థిరమవుతుందని ఆయన పేర్కొన్నారు. రవి హైస్కూల్ మరెన్నో విజయాలు సాధించి విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన అతిధులు విశ్రాంతి డీఎంహెచ్ఓ కే.మాశిలామణి ఎంఈఓలు పి.రమేష్, మధుసూదన్‌రెడ్డిలు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో కార్పొరేట్ స్థాయి పాఠశాలల నిర్వహణ ఎంతో కష్టంతో కూడుకున్న పనిని అలాంటిది రవి పాఠశాల స్థాపించినప్పటి నుండి ఇప్పటి వరకు విద్యార్థుల నుండి కానీ వారి తల్లిదండ్రుల నుండి ఎలాంటి నిర్వహణ విషయంలో ఫిర్యాదులు రాకపోవడం వారు పాఠశాల నిర్వహణకు శ్రమిస్తున్న పనితీరు ఎంతగానో ప్రశంసనీయమని పేర్కొన్నారు. వార్షికోత్సవ వేడుకల్లో విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. తమ పిల్లల నృత్య ప్రదర్శన తిలకించడానికి పిల్లల తల్లిదండ్రులు వారి బంధువుల సైతం పాల్గొని కార్యక్రమాన్ని ఎంతగానో విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ శ్రీనివాసరావుకు జీవితకాల పురస్కారం

కావలి, ఏప్రిల్ 22 ప్రభాతవార్త : శ్రీ జగద్గురు ఆదిశంకరాచార్య జయంతి సందర్భంగా వాగ్దేవిపుత్ర ప్రముఖ అధ్యాత్మిక ప్రవచనకర్త డాక్టర్ నందనవనం శ్రీనివాసరావుకి స్థానిక శివాలయం శంకరమఠం రంగంలో జీవితకాల సాఫల్య పురస్కారంను మంగళవారం రాత్రి ప్రధానం చేశారు. ఈ సందర్భంగా శంకరమఠం అధ్యక్ష, కార్యదర్శులు కసవరాజు శ్రీనివాసరావు, గణపతి రాజు మారుతిరామారావు, ఉపాధ్యక్షుడు టంగుటూరి ప్రకాశరావు, నందనవనం శ్రీహరిరావు, నందనవనం మధుసూదన్‌రావులు పాల్గొని ఆయనను శాలువాలతో పూలమాలలతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు.



సోము వెంకటేశ్వర్ రెడ్డిని పరామర్శించిన మన్నెమాల

బిట్రగుంట ఏప్రిల్ 22 ప్రభాతవార్త : బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీ కొత్తూరు గ్రామం లోని సోము వెంకటేశ్వర్ రెడ్డిని అనారోగ్యంతో బాధపడుతున్నారని విషయం తెలుసుకొని బుధవారం కావలి మాజీ ఏఎంసీ చైర్మన్ మన్నెమాల సుకుమార్ రెడ్డి పరామర్శించి ఆరోగ్య క్షేమ సమాచారాన్ని తెలుసుకున్నారు. త్వరితగతిన కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఆయన వెంట విశ్వనాథరావుపేటకు చెందిన గందూరి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాన్ని ప్రారంబించిన ఆర్టీసీ డిఎం

జలదంకి,ఏప్రేల్22,ప్రభాతవార్త: జలదంకి ఆర్టీసి బస్టాండ్ ఆవరణలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని కావలి ఆర్టిసి డిపో మేనేజర్ ఆదినారాయణ బుదవారం ప్రారంభించాడు. రెడ్‌క్రాస్ శాఖ చలివేంద్రాన్ని ఏర్పాటుచేసి సపహకారమందించగ డిఎం ఆశాఖ సేవలను ఎంతగానో కొనియాడాడు. ఆయన మాట్లాడుతు ప్రస్తుత వేసవి తీవ్రతదృష్ట్యా ప్రయాణీకులకు త్రాగునీటి సౌకర్యం కల్పించడం శ్లాఘనీయ మన్నారు. బస్టాండ్ పరిదిలో నెలకొన్న సమస్య లను దశలవారీగ పరిష్కరించడం జరుగుతు ందన్నారు. ప్రయాణీకులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండ తగు చర్యలు తీసుకుంటామని స్పష్టంచే శాడు. పంచాయతి కార్యదర్శి వెంకటకృష్ణ మాట్లాడుతు ప్రజల ఆవసరాలను గుర్తించి తగు సేవా కార్యక్రమాలు చేపడుతున్న రెడ్‌క్రాస్ సంస్థ ప్రశంశించబడుతుం దన్నారు. వేసవిలో చలివేంద్రాల ద్వార ప్రజల, ప్రయాణీకుల దాహార్తిని తీర్చడం గొప్ప సేవగ ఆయన అభివర్ణించాడు. జలదంకి రెడ్‌క్రాస్ చైర్మన్ వద్దే శ్రీనాద్‌రె డ్డి మాట్లాడుతు ప్రజాసేవలో తరించడమే రెడ్‌క్రాస్ ధ్యేయమని అవసరమైన చోట ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహిం చేందుకు సంస్థ ఎపుడు ముందుంటు ందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిపో ట్రాపిక్ అసిస్టెంట్ మేనేజర్ కల్పన, కావలి రెడ్‌క్రాస్ చైర్మన్ డి రవిప్రకాష్, జలదంకి రెడ్‌క్రాస్ ఉపాధ్యక్షుడు గోసు ప్రసాద్ యాదవ్, కార్యదర్శి వాక హజరత్‌రెడ్డి, ఏగూరి రఘు, సభ్యులు ముడి కిషోర్‌రెడ్డి, వంటేరు రాకేష్‌రెడ్డి ,భీమవరపు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలలో ఖచ్చితంగ చేర్పించండి: ఆర్‌జెడి

జలదంకి,ఏప్రేల్22,ప్రభాతవార్త: మండలంలోని అన్ని గ్రామాలలో బడిఈడు పిల్లల్ని గుర్తించి ఖచ్చితంగ ప్రభుత్వ బడులలో చేర్పించాలని గుంటూరు జోన్ విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ బి లింగేశ్వరరెడ్డి ఆదేశిం చాడు. బుదవారం ఆర్‌జెడి జలదంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను అకశ్మికంగ తనిఖీచేశాడు ఎన్‌రోల్ మెంట్‌ను పరిశీలించాడు. విద్యార్థుల చదువులు ఎలా వున్నాయి అందుకు సంబందించి తీసుకుంటున్న చర్యలను వాకబుచేశాడు. డ్రాపౌట్సు గూర్చి పలు సూచనలు సలహాలు ఇచ్చాడు. ప్రభుత్వం నిర్దేశించిన అకడమిక్ స్టాండర్డ్స్ సాదించాలని పిలుపునిచ్చాడు. ఐదేళ్ళు నిండిన పిల్లలకోసం బడిపిలుస్తుంది అనే కార్యక్ర మాన్ని రూపొందించడం జరిగిందని దాని విజయవంతానికి అందరు కృషిచేసి మంచి ఫలితా లను సాదిం చాలని అన్నారు. అందుకు గ్రామస్తుల సహకారం తప్పక తీసుకోవాని దిశానిర్దేశం చేశాడు. ఆయ న వెంట కావలి డివిజన్ ఉప విద్యాశాఖాదికారి మారెళ్ళ హరిప్రసాద్, జలదంకివిద్యాశాఖాదికారులు ఎన్ పద్మనాభా రావు, సిహెచ్‌నాగేశ్వరరావు, ప్రదానోపాద్యాయుల, ఉపాద్యాయిని ఉపాద్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ధ్యానకు ఆర్థిక సాయం చేసిన సంయుక్త సేవా సంస్థ

కావలి, ఏప్రిల్ 22 ప్రభాతవార్త : బోగోలులో నివాసం ఉంటున్న 11ఏళ్ళ చిన్నారి ఎంఆర్ ధాన్య పల్మనేరి హైపోటెన్షన్ వ్యాధితో బాదపడుతూ ఆక్సిజన్ మీదే ఆదారపడి జీవిస్తూ అత్యవసరంగా ఆక్సిజన్ మిషన్ అవసరమై ఉన్నందున సంయుక్త సేవాసంస్థ ద్వారా చిన్నారి తండ్రి అశోక్ కుమార్ చేతికి రూ.12,700లు ఆర్థిక సహాయాన్ని బుధవారం స్థానిక సంయుక్త సేవా సంస్థ కార్యాలయంలో సంస్థ వ్యవసాపక అధ్యక్షుడు సురేంద్ర అందజేశారు. ఈ సందర్బంగా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు మాట్లాడుతూ చిన్నారి తండ్రి అశోక్ కుమార్ తన కుమార్తె చిన్నారి ధ్యాన పల్మనేరి హైపోటెన్షన్ వ్యాధితో బాదపడుతూ ఉందని నిరంతరం ఆక్సిజన్ మీదే ఆధారపడి జీవిస్తూ ఉందని, ప్రస్తుతం వారి దగ్గర ఉన్న ఆక్సిజన్ మిషన్ సక్రమంగా పనిచేయకపోవడంతో చిన్నారికి ఆక్సిజన్ అందక ఇబ్బంది పడుతూ ఉందని తెలిపారు. సంయుక్త సేవాసంస్థ ద్వారా ఆక్సిజన్ మిషన్‌సాయం చేతయలని కోరడంతో ఈ విషయాన్ని తమ సంస్థ సభ్యులు దృష్టికి తీసుకొని వెళ్లి వెంటనే స్పందించి రూ.12,700లు అందజేసి దాతృత్వం చాటుకొన్న దాతలకు ధన్యవాదాలు తెలిపారు. చిన్నారి తండ్రి అశోక్‌కుమార్ మాట్లాడుతూ తన కుమార్తె ఆరోగ్యంపై తెలియజేసిన వెంటనే స్పందించి సాయం అందజేసి తమకు అండగా నిలిచిన సంస్థ సభ్యులకు, సంస్థ వ్యవస్థాపకుడు సురేంద్రకు ధన్యవాదాలు తెలిపారు.

జనగణన సెల్ఫ్ ఎన్యుమరేషన్‌పై అవగాహన

కావలి, ఏప్రిల్ 22 ప్రభాతవార్త : కావలి విక్రమ సింహపురి యూనివర్శిటి కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం భారత ప్రభుత్వం చేపట్టిన 2026 జనగణన సెల్ఫ్ ఎన్యుమరేటషన్‌పై బుధవారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించడం జిరగిందని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొపెసర్ సిహెచ్ శ్రీనివాసరావు పేర్కొనడం జరిగింది. ఈ అవగాహన కార్యక్రమంలో విద్యార్థులకు సెల్ఫ్ ఎన్యుమరేషన్‌లో ఏ విధంగా పాల్గొనాలి, వెబ్‌సైట్‌లో పొందుపరిచిన ప్రశ్నలను ఏ రకంగా పూరించాలి, వెబ్‌సైట్ పని చేసే సమయంల మొదలగు విషయాలపై విద్యార్థులకు ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ సుశీలలు అవగాహన కల్పించడం జరిగింది. దీనికి సంబందించి ప్రిన్సిపాల్ ప్రొపెసర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈనెల 30వ తేది లోగా సెల్ఫ్ ఎన్యుమరేషన్‌లో విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని పేర్కొనడం జరిగింది.

శ్రీచైతన్య డిగ్రీ కళాశాలలో ముగిసిన పూల్‌క్యాంపస్ డ్రైవ్

కావలి, ఏప్రిల్ 22 ప్రభాతవార్త : కావలి శ్రీచైతన్య డిగ్రీ కళాశాల క్యాంపస్‌లో బుధవారం నిర్వహించిన కూల్ క్యాంపస్ డ్రైవ్ విజయవంతంగా ముగిసిందని కళాశాల ప్రిన్సిపాల్ పివి.రాము తెలిపారు. ఈ క్యాం పస్ డ్రైవ్‌కు మొత్తం 103 మంది అభ్యర్థులు నమోదు చేసుకోగా వారిలో పోర్ట్ మేనేజ్‌మెంటు సర్వీస్ కంపెనీకి 27మంది, కాల్ మెన్ సర్వీస్ కంపె ఈనిక 18మంది అభ్యర్థులు ఎంపిక కావడం జరిగిం దన్నారు. ఈ డ్రైవ్‌కు కాల్‌మెన్ సంస్థ ప్రతినిధి ధనరాజ్, పర్గెట్ మేనేజ్‌మెంట్ సర్వీస్ కంపెనీ ప్రతినిధి రజని హాజరై ఇంటర్వ్యూలను నిర్వహించడం జరిగిందన్నారు. ఈసందర్భంగా విద్యార్థులు తమ కమ్యూనికేషన్ నైపు ణ్యాలు, సబ్జెక్ట్ పరిజ్ఞానం, ప్రొపెషనల్ ప్రవర్తనను చక్కగా ప్రదర్శించిన వారు మంచి అవకాశాలను పొందడం జరిగిందన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి క్యాంపస్ డ్రైవ్ మరిన్ని నిర్వహి స్తున్నట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ బెజవాడరవికుమార్, డైరెక్టర్ పి.జానకిరామ్, అకాడమిక్ ప్రిన్సిఆపల్ పివి.రావు, ఎన్ఏఏసి ప్రిన్సిపాల్ ఎం.రవికాంత్, ప్లేస్ మేనేజ్‌మెంటు ఆధికారి ఎ.మహేష్‌కుమార్, నోడల్ ఆఫీసర్ ఎస్‌కె.కబీర్అహ్మద్, బోధన సిబ్బంది అభినందించారు.

చంద్రబాబునాయుడు కాలనీ రైల్వేగేట్‌ను పునరుద్దరించాలి

కావలి, ఏప్రిల్ 22 ప్రభాతవార్త : కావలి మున్సిపాలిటి పరిధిలోని ముసునూరు చంద్రబాబునాయుడు కాలనీ వద్ద ఉన్న రైల్వేగేట్‌ను వెంటనే పునరుద్దరించాలని వావపక్ష నేతలు పసు పులేటి పంచలయ్య, కొప్పర్తి నాగరాజు, న్యాయ వాది కరవది భాస్కర్‌లు బుధవారం స్థానిక మున్సిపల్ కమిషనర్ శ్రావణ్ కుమార్‌ని కలసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ రైల్వే అండర్ పాస్ నుంచి చంద్ర బాబునాయుడు కాలనీ ఇందిరమ్మ కాలనీ, వినాయకనగర్, గిరిజన కాలనీలకు అనుసంధానంగా ఆప్రోజ్ రోడ్డును తక్షణమే నిర్మించాలని కోరడం జరిగిందన్నారు. రైల్వే అండర్ పాస్ పూర్తియిన తరువాత అండర్ పాస్ నుంచి కాలనీకి రోడ్డు నిర్మించేవరకు రైల్వేగేటును మూసివేయరాదని మున్సిపాలిటి నుంచి రైల్వే అధికారులకు తెలియజేస్తామని తెలిపారు. స్థానిక అధికారులకు ప్రజలకు సమాచారం ఇవ్వకుండా కనీస నియమాలు పాటించకుండా అర్థాంతరంగా రైల్వేగేట్‌ను మూసివేసి అత్యుత్సాహం ప్రదర్శించారని తెలిపారు. రైల్వే అండర్‌పాసుపనులు పూర్తయి దాని నుంచి ప్రజలు ఉండే కాలనీలకు రోడ్డు అనుసంధానంగా నిర్మించి ఆ తరువాత గేటు మూసివేత ఉండాలా లేదా అనే దానిపై నిర్ణయం తీసుకోవాలని కోరారు. మూసివేసిన గేటును తక్షణమే పునరుద్దరించాలని కోరారు. ప్రజల ప్రయోజనాలకు బిన్నంగా వ్యవహరిస్తే ప్రజా ఉద్యమం తప్పదని ఇది అధికారులు గుర్తించాలని అన్నారు.



భక్తి శ్రద్ధలతో జగద్గురు ఆదిశంకరాచార్యుల జయంతి స్వామి వారికి చందనాలంకారం

బుచ్చి ఏప్రిల్ 22 ప్రభాతవార్త శంకరమ ఠం లో జగద్గురు ఆదిశంక రా చార్యుల జయంతి సం ద ర్భంగా ఉదయం నుండి స్వామి వారికి ప్రత్యేకా బి షే కాలు,పూజలు, నిర్వ హించారు.అనంతరం స్వామి వారికి చెర్రిస్‌తో, చందనాలంకారంచేశారు.విఘ్నేశ్వరుడికి కూడా ప్రత్యేక పూ జలు నిర్వహించారు. అనంతరం సామూహిక ఉపనయనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్య క్రమం లో సుమారు 50 మందికి ఉపనయనం (ఒడుగులు)చేశారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు ప్రసాదాలు అందజేశారు.

చేపట్టే పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి

కోవూరు, ఏప్రిల్22 ప్రభాతవార్త : కోవూరు పెన్నా డెల్టా ఆయకట్టు పరిధిలో ఇటీవల వంద రోజుల ప్రణాళికలో భా గంగా సదరన్ కాలువలో చేపడుతున్న డీ సిల్టింగ్ పనులను బుధవారం ఇరిగేషన్ ఎస్ఈ దేశ్ నాయక్ పెన్నా డెల్టా ఆయ కట్టు చైర్మన్ రాజగోపాల్‌రెడ్డితో కలిసి నిశిత పరిశీలన చేపట్టా రు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ ప్రస్తుతం చేపట్టే ఈ పనులను నిర్దేశిం చిన నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా వారు పాటూరు, కోవూరు, తదితర ప్రాంతాల్లో జరిగిన పనులను నిశిత పరిశీ లన చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ పెంచలయ్య, ఏఈ శ్రీనివాసులు, తదితరులు ఉన్నారు.

ఏపీటిఎఫ్‌లో 60 మంది చేరిక

గూడూరు, ఏప్రిల్ 22, ప్రభాతవార్త గూడూరు అర్బన్ యూనిట్ నుండి సీనియర్ బాధ్యులు శివ రామ ప్రసాద్, రమణయ్య, షఫీల ఆధ్వర్యంలో 60 మంది కార్యకర్తలు చేరారు. ఈ సందర్భంగా ఏపీటి ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిరంజీవి మాట్లాడుతూ ఉపాధ్యాయులకు బోధనేతర కార్యక్ర మాలు, యాప్‌ల భారం తగ్గించుకుంటే ఒకే యాప్‌లో అనేక రకాల టైటిల్స్ పెట్టి విపరీతమైన వర్క్ లోడ్ పెంచారన్నారు. ఆన్లైన్ పద్ధతి, ఆఫ్ లైన్ పద్ధతి ద్వారా అధికారులకు వివరాలు ఇవ్వాల్సి ఉంటుంద న్నారు. గత సంవత్సరం బదిలీల్లో రిలీవర్ రాలేదని, నూతన స్థానానికి పంపణీ టీచర్లను, కోరుకున్న స్థానానికి ఇప్పుడైనా బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. వారి స్థానంలో డీఎస్సీ రిక్రూట్మెంట్ ద్వారా నూతన టీచర్లను నియమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్ర మంలో ఏపీటిఎఫ్ నాయకులు పిచ్చి బాబు, షేక్ బాబు, జైపాల్, భాస్కర్ రెడ్డి, శివ కుమార్ పాల్గొన్నారు.

మోమిడి గ్రామంలో వన్ విలేజ్ మన్ మంత్ కార్యక్రమం

చిల్లకూరు, ఏప్రిల్ 22, ప్రభాతవార్త గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్ కు మార్ ఆద ేశాలతో శ్రీ పెనుసుల నరసింహా స్వా మి దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ మాజీ చైర్మ న్ తానంకి నానాజీ సూచనలతో, చిల్లకూరు మండల పార్టీ అధ్య క్షులు దువ్వూరు రాజశేఖర్ రెడ్డి సూచనలతో బుధవారం చిల్లకూరు మండలం మోమిడి గ్రామంలో వన్ విలేజ్ వన్ మంత్ ఫోర్ విజిట్ కార్యక్రమంలో భాగంగా మూడువా విజిట్‌గా గ్రామ సభ నిర్వహించారు. ఈ సభలో రెవెన్యూ సిబ్బంది సచివాలయ సిబ్బంది అన్ని శాఖలకు సంబంధించిన అధికారులు పాల్గొని గ్రామంలోని సమస్యలను అర్జీల రూపంలో తీసుకున్నారు. అధికారులు మాట్లాడుతూ వీలైనంత తొందరలో మీ సమస్యలను పరిష్కరిస్తామని గ్రామస్తు లకు హామీ ఇచ్చారు. వరగలి, మన్నెగుంట తెలుగుదేశం పార్టీ, బిజెపి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

అత్యంత వైభవంగా పాఠశాల వార్షికోత్సవ వేడుకలు

కావలి, ఏప్రిల్ 22 ప్రభాతవార్త :రాముడు పాలెం గ్రామం లోని మండల ప్రజాపరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో బు ధవారం వార్షికోత్సవ వేడుకలు పాఠశాల హెచ్ఎం ఉమా మహేశ్వరి అధ్యక్షతన వైభవంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా కొత్తసత్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం శ్రీనివాసులు పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం విద్యపై ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని అందుకే నాణ్య మైన విద్యకు నూతన వరవడి సృజించబడినదని తెలిపారు. ప్రభుత్వ బడుల్లో తమ పిల్లలను చేర్పిచే ఉన్నత విద్యను అభ్యసించడానికి మార్గం ప్రభుత్వశాలల్లో చూపిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు బహుమతులు అందజేశా రు. చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని అబ్బురపరిచాయి. పాఠశాల ఎస్ఎంసి ఛైర్మెన్ హేమలత, ఉపాధ్యాయులు రవీంద్ర ప్రసాద్, రెహమాన్, వెంకటేశ్వరరావు, రవిచంద్ర, ప్రసాద్‌రావు, ఉదయవాణి, కాత్యాయని, విజయలక్ష్మి, తిరుమల, విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామ కాపులు పాల్గొన్నారు.

రత్నం స్కూల్‌లో గ్రాడ్యుయేషన్‌డే, యానివల్‌డే వేడుకలు

బుచ్చి ఏప్రిల్ 22 ప్రభాతవార్త బుచ్చిరెడ్డిపాళెం మున్సిపాల్టీలోని రత్నం స్కూల్ గ్రాడ్యుయే షన్ డే,యానవల్‌డే వేడుకలు ఎం.ఎం ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు.ఈకార్యక్రమం డైరక్టర్ ఎం. వెంకట్, జనరల్ మేనేజర్ సిహెచ్ మల్లికార్జున నేతృత్వంలో నిర్వహించారు.కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా టిడిపి టౌన్ అద్యక్షులు గుత్తా శ్రీనివాసులు, అపస్మా జిల్లా అధ్యక్షులు నేలనూతల శ్రీదర్, నేతాజి స్కూల్ కరస్పాండెంట్ మల్లేశ్వర్‌రెడ్డి , మేనేజర్ రవితేజా, తదితరులు వ్యవహారించారు. ఈ సందర్భంగా టిడిపి టౌన్ అధ్యక్షులు గుత్తా శ్రీనివాసులు మాట్లాడుతు రత్నం స్కూల్ విద్యార్ధులు ఉత్తమ ఫలితాలు సాధిస్తు న్నారని ఆయన అభి నందించారు. రత్నం స్కూల్ ఉపాధ్యాయులు విద్యార్ధులను ఎంతో క్రమశిక్షణతో తీర్చి దిద్దుతారని ప్రశంసిం చారు. డైరక్టర్ వెంకట్, జనరల్ మేనేజర్ మల్లికార్జున నిత్యం విద్యార్ధుల పట్ల ఎంతోశ్రద్ద తీసుకుంటారని అన్నారు. ఈకార్యక్రమంలో క్రీడలలో విజేతలైన విద్యార్ధులకు బహుమతులు అందజేశారు. అలాగే రత్నం స్కూల్ పదోవతరగతి వరకు చెదవి ఇంటర్‌లో కోవూరు నియోజకవర్గంలో టాపర్‌గా నిలిచి 990 మార్కు లు తెచ్చుకున్న పి.రెవినా లక్ష్మీని శాలువా కప్పిఅభినందించారు. అనంతరం విద్యార్ధులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈకార్యక్రమంలో విద్యార్ధుల తల్లిదండ్రులు పాల్గోన్నారు.

పైప్‌లైన్ లీకేజ్‌కు గంటల్లోనే పరిష్కారం : ఎంపీడీవో సుబ్బారావు

కొడవలూరు,ఏప్రిల్ 22 ప్రభాతవార్త:మండల కేంద్రంలోని హరిజ నవాడకు వెళ్లే దారిలో ఉన్న తా గునీటి పైప్‌లైన్ లీకేజ్ సమస్యను ఎంపీడీవో వెంకట సుబ్బారావు ముందుగానే గుర్తించి సంబంధిత అది కారులకు తెలి యజేశారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు అధికారులు వెంటనే స్పందించగా, పంచాయతీ కార్య దర్శి నసీమా ఆధ్వ ర్యంలో సిబ్బంది చర్యలు చేపట్టి కొన్ని గంటల్లోనే లీకేజీని అరికట్టారు. కొత్త పైపులను తెచ్చి అమర్చడంతో స్థానికులకు తాగునీటి సరఫరా తిరిగి సజావుగా అందుబాటులోకి వచ్చింది. పనుల్లో పూ ర్తిస్థాయిలో కృషి చేసిన పంచాయతీ కార్యదర్శి నసీమాసిబ్బందిని ఎంపీడీవో వెంకట సుబ్బారావు అభినందిం చారు. అధికారులు ప్రజా సమస్యల పరిష్కారంలో ఇదే విధంగా చురుకుగా వ్యవహరించాలని సూచించారు.

కమిషనర్ చొరవతో గుడిపల్లి కాలువతో చెత్త తొలగింపు



బుచ్చి ఏప్రిల్ 21 ప్రభావార్త బుచ్చిరెడ్డిపాళెం మున్సిపాల్టీలోని ఎనిమిదవార్డులోని గుడిపల్లి కాలువ చెత్తా చెదారంతో అత్యంత దయనీయంగా తయారు కాగా ఈవిషయాన్ని వైస్ చైర్‌పర్స న్‌పఠాన్ నస్రీన్ కమీషనర్ చిన్నబాబు దృష్టికి తీసుకొని వెల్లడం జరిగింది. వెంటనే స్పందించిన ఆయన మున్సిపల్ సిబ్బందితో కలిసి వెళ్ళి గుడి పల్లి కాలువలో చెత్తలను తొలగించారు. చెత్తను తొలగించడంతో మురికి నీళ్ళు సజావుగా పోతున్నాయి. కమీషన్ వెంటనే స్పందించినందుకు మైనార్టీ నాయ కులు పఠాన్ మహబూభాషా ప్రత్యేకంగా దన్యవాదాలు తెలిపారు.

పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణలో కమిషనర్

నెల్లూరు కార్పోరేషన్, ఏప్రిల్ 22 ప్రభాతవార్త : నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వైఓ.నందన్ పారిశుద్ధ్య నిర్వహణ పనుల పర్యవేక్షణ భాగంగా స్థానిక 39వ డివిజన్ మూలాపేట, రాజారామ్ మో హన్‌రాయ్ పార్కు, శివాలయం, వేణుగోపాల్ స్వా మి, రాజావారి వీధులలో తదితర ప్రాంతాల్లో మెగా ఇంజనీరింగ్ వర్క్స్ ఇంజనీర్లు, నెల్లూరు నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం అధికారులతో బుధ వారం పర్యటించారు. ఈ సందర్భంగా డివిజన్ పరి ధిలోని సురక్షిత తాగునీటి సరఫరా నిర్వహణ తీరు ను కమిషనర్ పర్యవేక్షించారు. తాగునీటి సరఫరాపై ప్రజలతో ప్రత్యక్షంగా కమిషనర్ మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకొన్నారు. కమిషనర్ నాణ్యతను ప్రజల ముందే పరీక్షలు జరిపి ఫలితాలపై సంతృప్తిని వ్యక్తం చేశారు. నూతనంగా నిర్మించిన భవనాలకు సంబంధిం చి పట్టణ ప్రణాళిక విభాగం అనుమతులు మేరకు మాత్రమే నిర్మాణాలు చేపట్టే విధంగా సంబంధిత అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. డివిజన్‌లోని అన్ని రోడ్లను పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసు కోవాలని తెలిపారు. కాలువలపూడికతీత పనులు చేపట్టాలని శానిటేషన్ విభాగం వారికి సూచించారు. నగ రపాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం అధికారులు, టౌన్‌ప్లానింగ్ అధికారులు, వార్డు సచివాలయ అధికారులు, కార్యదర్శులు, మెగా ఇంజనీరింగ్ సంస్థ ఇంజనీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

వాటర్ ట్యాంక్ మరమ్మత్తులు పనుల పరిశీలన కమిషనర్ వైఓ.నందన్

నెల్లూరు కార్పోరేషన్, ఏప్రిల్ 22 ప్రభాతవార్త : నెల్లూరు నగరపాలకసంస్థ కమిషనర్ వైఓ.నందన్ స్థానిక 47వ డివిజన్ ప్రాంతంలోని ఈఎస్ఎల్ఆర్ ఓవర్‌హెడ్ ట్యాంక్‌కు పూర్తయిన మరమ్మత్తు, సుందరీకరణ పనులను ఇంజనీరింగ్ విభాగం అధికారులతో కలసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సమీపంలోని నగరపాలక సంస్థ మున్సిపల్ ఉర్దూ పాఠశాల ప్రాంగణాన్ని కమిషనర్ సందర్శించారు. పాం శాలల విద్యార్థులకు అందుతున్న తాగునీటి వసతి, మరుగు దొడ్ల సదుపాయం, క్రీడా పరికరాలు, విద్యాప్రమాణాలను విద్యార్థులు, ఉపాధ్యాయులను అడిగి తెలుసు కొన్నారు. డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాలలో కమిషనర్ సందర్శించి తాగునీటి సరఫరా నీటినాణ్యతను పరీక్షించి స్థానికులతో ప్రత్యక్షంగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక డివిజన్ కార్పోరేటర్ ప్రజాప్రతినిధులు, నాయకులు, నెల్లూరు నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం ఎస్ఈ రహంతుజానీ, వార్డు సచివాలయం కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

అవినీతిని ప్రశ్నిస్తే సమాధానం చెప్పలేక ఎదురుదాడులు

నెల్లూరు ఎప్రిల్ 22 ప్రభాతవార్త విద్య నెల్లూరు కార్పొరేషన్ లో జరు గుతున్న అవినీతినిప్రశ్నిస్తే అందుకు సమాధానం చెప్పలేని మంత్రి నారాయణ , చిల్లర నాయకులతో ఎదురుదాడికి దిగటం సరైన పద్ధతి కాదని వైకాపా రాష్ట్ర బిసి సెల్ నాయకులు మల్లి నిర్మలపెర్కొన్నారు . బుదవారం వైకాపా నగర కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు . ఈ సందర్బగా ఆమె మాట్లడుతూ నెల్లూరు నగరంలో జరుగుతున్న అవినీతిపై మా నాయకులు పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి రాజీలేని పోరాటం చేస్తు న్నారన్నారు. చంద్రశేఖర్ రెడ్డి అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా కూటమి నేతలు దాటవేసే ధోరణిలో మాట్లాడుతున్నారని, మంత్రి నారాయ ణని సూటిగా జరగుతున్న అవినీతిపై సమధానం చెప్పాలని డిమాండ్ చెసారు. చంద్రశేఖర్ రెడ్డి రాజ కీయా ల్లో ఎలా మాట్లాడాలో కూడా కూటమినేతలే చెబుతున్నారని ,ఇది విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటికైనా టిడిపినాయకులు చంద్రశేఖర్ రెడ్డి గురించి.. మాట్లాడేటప్పుడు నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని సుచించారు .మంత్రి నారాయణ అవినీతి జరగలేదని ఇప్పటివరకు ఎలాంటి ఆధారాలు చూపలేక పో యారని అన్నారు. ఒకొక్క చెట్టుకు 5వేల రూపాయలు ఖర్చు చేయడానికి పూర్తిగా అనుమతులు తీసుకొని చంద్రశేఖర్ రెడ్డి ప్రశ్నించేసరికి పొంతన లేని మాటలతో టిడిపి నేతలు వరుస ప్రెస్ మీట్ లు పెట్టి మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు .

విపిఆర్ నేత్ర ఇండియాలోనే దిబెస్ట్ : కాకర్ల

కలిగిరి,ఏప్రేల్22, ప్రభాతవార్త ;నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి చేస్తున్న శేవలు చూస్తుంటే భారతదేశంలోనే మరెవ్వరూ ఇంతగా చేయల రేమో అని ఉదయగిరి శాసన సబ్యులు కాకర్ల సురేష్ తెలిపారు.గత రెండురోజులుగా మండలకేంద్రమైన కలిగి రిలో విపిఆర్‌నేత్ర కార్యక్రమం జరుగుతుంది.ఈ కార్యక్ర మానికి ప్రజలనుండి విశేష స్పందన లబిస్తుంది. బు దవారం కలిగిరిలో జరుగుతున్న విపిఆర్‌నేత్ర కార్యక్ర మానికి ఉదయగిరి శాసన సబ్యులు కాకర్ల సురేష్ దంపతులు హాజరై బాదితులకు కంటి అద్దములు పంపిణీ చేయడమే కాకుండా విపిఆర్ కంటి శిభిరంలో పాల్గొన్నారు.అనంతరం జరిగిన కార్యక్రమంలో యంఎల్ఏ కాకర్ల సురేష్ మాట్లాడుతూ విపిఆర్ చేపడుతున్న , ప్రజలకుచేస్తున్న మంచిపనులు చూస్తుంటే ఇండియా లోనే మరెవ్వరూ చేయలేని విదంగా ప్రజలకు ఉపయోగపడుతున్న మన విపిఆర్ఇండియాలోనే ధి బెస్ట్ యంపిగా మెచ్చుకోవచ్చన్నారు.విపిఆర్ దంపతులు ప్రజలకు ప్రజలకు సేవచేయడంలో ముదుంటారన్నారు.ప్రజలకు తాగునీటికోసం వాటర్‌ప్లాంట్లైతేనేమి,ఎన్నో దేవాలయాలకువిరాళాలు ఐతేనేమి.ఇప్పుడు ఈ విపిఆర్‌నేత్రఇలా ఎన్నో ప్రజలకు ఉపయోగ పడే విషయాలేనన్నారు. ఇలాంటి యంపి దొరకడం మన అదృష్ట మన్నా రు.విపిఆర్ పౌంషన్ స్తాపించి ఎన్నో మంచి పనులు చేపడుతున్నారన్నారు. వేమిరెడ్డి ఏపని చేపటాటలన్నా అది ఒక్క ఉదయగిరి నియోజక వర్గంనుండే మొదలు పుడుతుండడం మన అదృష్టమన్నారు.ఈ ప్రాతం వెనుకబడిన ప్రాంతమని విపిఆర్ మెండుగా నమ్మినవ్యక్తి అన్నారు.తానుకూడా కాకర్ల చారిటీబుల్ ట్రస్టు పేరుతో ఎంతోమందికి శేవచేయడంజరిగిందన్నారు.ఉదయగిరి నియోజకవర్గంలో సుమారు 40వేలమందికి కంటిపరీక్షలు నిర్వహించి22,2,30మందికి కంటి అద్దములు ఇవ్వడం జరిగిందన్నారు.ఉదయగిరి నియోజక వర్గంలో2లక్షల40వేలమంది ఓటర్లు ఉంటే 40వేలమంది విపిఆర్ నేత్ర శేవలు చేయించుకున్నారన్నా రు.ప్రజలకు ఇంతమంచి సేవలు చేస్తున్న విపిఆర్ దంపతులరుణం ఉదయగిరి ప్రజలతరపున కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామన్నారు.ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ పూసాల వెంగపనాయుడు,జిల్లా ఉపాధ్యక్షులు బిజ్జంక్రిష్టారెడ్డి,చింతంరెడ్డి,సుబ్బారెడ్డి, కలిగిరిసొసైటీ అధ్యక్షులు కదిరి రంగారా వు,ఎ హెచ్.సుబ్బారెడ్డి,కొండలరావు,విపినేత్ర తరపునశంకర్,వై.సతీష్ తదితరులుపాల్గొన్నారు.

మాజీ సీఎం నాదెండ్ల భాస్కర్ రావు మృతికి ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి సంతాపం

నెల్లూరు, ఏప్రిల్ 22, ప్రభాతవార్త–వైద్యం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కర్ రావు గారి మరణం పట్ల కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి తీవ్ర విచారాన్ని వ్యక్తం చేశారు. ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వంలో మంత్రి నాదెండ్ల మనోహర్ గారికి పితృవియోగం కలగడం అత్యంత బాధాకరమని ఈ కష్ట సమయంలో మనోహర్‌కి వారి కు టుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. సుదీర్ఘ రాజ కీయ ప్రస్థానంలో పరిపాలనా దక్షులుగా నాదెండ్ల భాస్కర్ రావు గారు చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. తండ్రి ఆశయాలకు అనుగుణంగా మనోహర్ ప్రజాసేవలో కొనసాగుతున్న తరుణంలో వారికి మార్గదర్శిగా ఉన్న తండ్రిని కోల్పోవడం విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. నాదెండ్ల భాస్కర్ రావు ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ ఈ కష్టసమయంలో వారి కుటుంబానికి ఆ భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు.

మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కర్ రావు మరణం పట్ల ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి

నెల్లూరు, ఏప్రిల్ 22, ప్రభాతవార్త–వైద్యం ఆంధ్రప్రదేశ్ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ గారికి పితృవియోగం కలగడం అత్యంత బాధాకర మని ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఒక ప్రకటనలో వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియచేసారు. మంత్రిగా, ముఖ్యమంత్రిగా నాదెండ్ల భాస్కర్‌రావు రాష్ట్ర అభివృద్ధికి చేసిన సేవలను ఈ సందర్భంగా ఎంపి వేమిరెడ్డి స్మరించుకున్నారు. వారి ఆత్మకుశాంతి చేకూరాలని ఈ కష్ట సమయంలో భగ వంతుడు వారి కుటుంబానికి మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు.

సంగం ఎంపిడిఒ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం



సంగం ఏప్రిల్ 22 ప్రభాతవార్త సంగం ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి కం టాబత్తిన పద్మావతమ్మ అధ్యక్షతన సాధా రణ సర్వసభ్య సమావేశం నిర్వహిం చారు.ఈకార్యక్రమంలో ఎంపిడిఒ షాలె ట్‌అభివృద్ధి కార్యక్రమాల నివేదికను చదివి వినిపించారు. పలుశాఖల అధికారులు ఆయాశాఖల పరిధిలో జరు గుతున్న అభి వృద్ధి పనుల గురించి తెలియజే శారు. వేసవిలో తీసుకోవాల్సి న జాగ్రత్తల గురించి చర్చించారు. జడ్‌పిటిసి సభ్యురాలు రావుల లక్ష్మీ, ఎంపిటిసి సభ్యులు,ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

కోవూరు, ఏప్రిల్22 ప్రభాతవార్త : రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు సాగాలనే తపనతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ని రంతరం కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి అన్నారు. కోవూరు పంచాయతీ పరిధిలోని మూ డవ వార్డులో గ్రామ సందర్శన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అభివృద్ధి కార్యక్రమాలను ఆశిం చిన మేర చేపట్టిన దాఖలాలు లేవన్నారు. ప్రస్తు తం కూటమి ప్రభుత్వం వచ్చిన ఈ 22 నెలల కాలంలో సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు జోరుగా సాగుతున్నాయన్నారు. నాయకులు కూడా ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రత్యేక చొరవ చూపినప్పుడే అభి వృద్ధి మరింత వేగవంతం అవుతుందన్నారు. ఇటువంటి మంచి ప్రభుత్వాన్ని ఎన్నుకున్న ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. కోవూరు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముం దంజలో సాగాలన్నదే తమ ప్రధాన ధ్యేయమన్నారు. వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సహకారంతో కోవూరు నియోజకవర్గంలో విడవలూరు మండలంలో వీపీఆర్ నేత్ర కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి జన్మదినం సందర్భంగా ప్రారంభించడం జరిగిందన్నారు. ప్రజలు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అడుగుజాడల్లో నడుస్తూ ప్రజా సేవలో ముందుంటానని ఈ సందర్భంగా ఆమె స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికీ వెళ్లి సమస్యల పరిష్కారంపై ఏమైనా ఉంటే వారిని అడిగి స్వయంగా తెలుసుకున్నారు.ఎంపీపీ టి. పార్వతిమండల పార్టీ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షుడు మల్లారెడ్డి పార్టీ సీనియర్ నాయకులు తాటిపర్తి విజయా రెడ్డి, సాయిరెడ్డి, సాయి జయంత్‌రెడ్డిశ్రీనివాసులు, సుబ్బానాయుడు, ,వై. వెంకటరమణమ్మ, వెంకటే శ్వర్లు, జహంగీర్,మదన్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, విన్నకోటరాధాకృష్ణ,ఫిరోజ్‌ఖాన్,అశోక్ కుమార్,మధుసూదన్‌రావు ,,చింతలపూడి పెంచలయ్య, శ్రీనివాసులు నాయుడు, ఎంపీటీసీ సభ్యులు నాగరాజు, సునీల్‌కుమార్ రెడ్డి, ఆదాలశివారెడ్డి, సుబ్బానాయుడు, బాలరవి,కూటమినేతలు శ్రీనివాసులురెడ్డి,,ఎంపీడీవోశ్రీహరిరెడ్డి, డిప్యూటీ ఎంపీడీవోలు శ్రీనివాసులు,సురేష్, స్థానికనేతలు దారావిజయ్‌బాబు, ఎం. సుధాకర్, జాన్సన్, పాల్గొన్నారు.

అమ్మకు మందులు తీసుకొని వెళుతు....

మోటార్‌బైకు ను ట్రాక్టర్ ఢీకొనగా విద్యార్ధి మృతి

బుచ్చి ఏప్రిల్ 22 ప్రభాతవార్త అమ్మకు ఆరోగ్యం బాగులేదని మందులు తీసుకొని మోటార్ బైకు మీద స్నేహితుడుడితో కలిసి వెళు తుండగా ట్రాక్టర్ మోటార్ బైకు ఢీకున్న సంఘటనలో విద్యార్ధి మృతి చెందాడు. బుచ్చిరెడ్డిపాళెం భగత్‌సింగ్ కాలనీలో విషాద చా యలు అలముకున్నాయి. పోలీసుల వివరాల మేరకు బుచ్చిరెడ్డిపాళెం భగత్ సింగ్ కాలనీకి చెందిన సుజిత్ అనే విద్యార్ధి సంగం మండలం అన్నారెడిపాళెంలో ఉన్న అమ్మకు మందులు ఇచ్చేందుకు స్నేహితుడు మనోజ్‌తో కలిసి మోటార్ బైకు మీద వెళుతున్నాడు. జెండాదిబ్బ రోడ్డు సమీపంలోని పెట్రోల్ బంకు వద్ద ఆకస్మికంగా ట్రాక్టర్ అడ్డంగా రావడం వారిని ఢీకొట్టడంతో సుజియ్ అక్కడిక్కడే మృతి చెందాడు, మనోజ్‌కి తీవ్రగాయాలు కావడంతో ఆవిద్యార్ధిని మెరుగైన వైద్యం కోసం వైద్యశాలకు తరలించారు. సిఐ సంఘటనా స్దలానికి చేరుకొని ట్రాక్టర్‌ని, సుజియ్ మృతదేహాన్ని తరలించారు. సుజియ్ తల్లిదండ్రులకు ఒక్కడే కుమారుడు లేకలేక వారికి కలిగిన సంతానం. మృతదేహం వద్ద తల్లి దండ్రులు హృదయ విదారాకంగా విలపించడం ప్రతి ఒక్కరి కంట కన్నీరు పెట్టించింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మృతి చెందిన విద్యార్ధి సుజయ్ కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి

బుచ్చి ఏప్రిల్ 22 ప్రభాతవార్త రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విద్యార్ధి సుజయ్ మృతదేహాన్ని కోవూ రు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతరెడ్డి సంద ర్శించారు. విద్యార్ధి మృతదేహంపైన పూలమాల వేసి నివాళులర్పించారు. లేకలేక కలిగిన కుమారుడు మృతి చెందడంతో విద్యార్ధి తల్లిహృదయ విదారకంగా విల పించడం చూసిన ఎమ్మెల్యే,నాయకులు విచారం వ్యక్తం చేశారు. ఆతల్లిని ఓదార్చడం ఎవ్వరివల్ల కావడం లేదు. సుజయ్మ్మ తదేహాన్ని చూసేందుకు పెద్దఎత్తున జనాలు తరలి వచ్చారు. ఈకా ర్యక్రమంలో సీనియర్ నాయకులు కోదూరు కమలాకర్‌రెడ్డి, ఛైర్‌పర్సన్ మోర్ల సుప్రజా మురళీ,జిల్లా పార్ల మెంటరీ ఉపాధ్యాక్షులు ఎంవి శేషయ్య, వైస్ ఛైర్మన్‌యరటపల్లి శివకుమార్‌రెడ్డి, కౌన్సిలర్ రాచూరు సత్యనా రాయణ, క్లస్టర్ ఇంచార్జిరామానాయుడు, కౌన్సిలర్ రహమత్, మైనార్టీనాయకులు పఠాన్ మహబూభాషా, దళిత నాయకులు ఉసురుపాటి ప్రసాద్, మున్సిపల్ కమీషర్ చిన్నబాబు, తదితరులున్నారు.

24 నుంచి పాఠశాలలకు వేసవి సెలవులు

కోట,ఏప్రిల్ 22 ప్రభాతవార్త రాష్ట్రంలోని పాఠశాలలకు ఈ నెల 24 నుంచి వేసవి సెలవులను పాఠశాల విద్యాశాఖ ప్రకటించింది. జూన్ 12న సెలవులల్లో ఎండ తీవ్రత చెరువుల,కాలువల వద్ద జరిగే ప్రమాదాల నివారణకు జిల్లా విద్యాధికారులకు పలు సూచను జారీ చేసింది. విద్యా సంవత్సరం చివరి రోజులోపు అన్ని ప్రభుత్వ ఎయిడెడ్ ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్దులకు భద్రతా చర్యలపై అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించింది. పెద్దల పర్యవేక్షణ లేకుండా కాలువలు, చెరువులు,నదులు,బావుల వద్దకు వెళ్లకూడదని మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఎండలో బయట తిరగకూడదని విద్యార్దులకు వివంచాలని సూచించింది. పాఠశాల నోటీసు బోర్డులపై భద్రతా నియామాలనుప్రదర్శిం చాలని ,తల్లిదండ్రులకు సైతం సూచనలు చెప్పి పిల్లల పై నిరంతర పర్యవేక్షణ ఉండేలా చూడాలని పేర్కొంది.

బయోగ్యాస్ ప్లాంట్ బీభత్సం.. ప్రజల ప్రాణాలపై ప్రయోగమా?

కోట్ల లావాదేవీల ముసుగులో గ్రామ పరిపాలనపై తీవ్ర ఆరోపణలు :
ధర్నాల వెనుక రాజకీయ లెక్కలపై అనుమానాలు :
దళితులే బలికావడంపై ఆగ్రహం..
గుమ్మడికాయ దొంగలు ఎవరు?" చర్చ రగులు

కొడవలూరు,ఏప్రిల్ 22 ప్రభాతవార్త: మం డలం పెయ్యలపాలెం గ్రామంలో బయోగ్యాస్ ప్లాంట్ వివాదం ఉద్రిక్తరూపం దాల్చింది. గ్రామ పరిధిలో ఉన్న రిలయన్స్ కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ నుంచి వెలువడుతున్న తీవ్ర దుర్వా సనతో గ్రామస్తులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో గ్యాస్ విడుదల, భారీ శబ్దాలు ప్రజల్లో భయాందోళనలకు దారితీస్తు న్నాయి. శ్వాసకోశ సమస్యలు, వాంతులు, కళ్ల మంటలు వంటి అనారోగ్య సమస్యలు పెరుగు తున్నాయని, చిన్నపిల్లలు తీవ్రంగా ప్రభావిత మవుతున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం రాత్రి గ్రామస్తులు ప్లాంట్ ఎదుట భారీ ధర్నా నిర్వహించి, ఫ్యాక్టరీ మూసివేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా దుర్వాసన తీవ్రతతో ముగ్గురు మహిళలు కుప్పకూలగా, 108 అంబులెన్స్ ద్వారా ఆసుపత్రికి తరలిం చారు. తెల్లవారుజామున మరో ఐదుగురు మహిళలు చికిత్స కోసం నెల్లూరుకు వెళ్లినట్లు స్థానికులు తెలి పారు. కాలుష్యం లేనివైట్ కేటగిరీ" పేరిట అనుమతులు పొందిన ప్లాంట్ ప్రస్తుతం విషవాయువులు వెదజల్లుతోందని గ్రామస్తులు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు."ప్రజల ప్రాణాలతో ఆటలు ఆడొద్దు.. వెంటనే ఫ్యాక్టరీ మూసివేయాలి" అంటూ నినాదాలు చేశారు. ఇదిలా ఉండగా, ఈ వ్యవహారం మరో కోణంలోనూ చర్చనీయాంశంగా మారింది. ప్లాంట్ ఏర్పాటులో కోట్ల రూపాయల లావాదేవీలు జరిగాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామ పరిపాలనలోని కొందరు పెద్దలు, స్థానిక నాయకులు భారీగా సొమ్ము చేసుకున్నా రనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్రజలను మధ్య పెట్టేందుకు ధర్నాలను రాజకీయ వేదికగా ఉపయోగిస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ము ఖ్యంగా ఈ వివాదంలో దళితులే ఎక్కువగా నష్టపోతున్నారని గ్రామస్తులు మండిపడుతున్నారు. ఇబ్బంది పడేది దళితులే, ధర్నాల్లో నిలబడేది దళితులే, ఆసుపత్రి పాలవుతున్నది కూడా వారేనని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అయితే, కొందరు నాయకులు కేవలం పేరు కోసం ముందుకు వచ్చి గొప్పలు చెప్పుకునే ప్రయత్నం చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి."గుమ్మడికాయ దొంగలు ఎవరు అంటే.. ఎవరు ఎవరు అన్నట్లుగా దప్పులు మోగుతున్నాయన్న అనుమానాలు ఉన్నాయి" అంటూ గ్రామంలో చర్చలు జోరుగా సాగుతున్నాయి. ఈ వ్యవహారం ఎక్కడ"సెట్ల్ అయిందో అక్కడే నిజాలు బయటపడతాయని ప్రజలు అంటున్నారు. ఇక ఫ్యాక్టరీ ప్రతినిధులు మాత్రం గ్రామస్తుల సంతకాలతోనే ప్లాంట్ నిర్మించామని చెబుతుండగా, తమకు తెలియకుండా సంతకాలు ఎలా సేకరించారో తెలియదని మహిళలు ప్రశ్ని స్తు న్నారు. ఈ ప్రాజెక్టుకు అనుమతులు ఎవరు ఇచ్చారు? పంచాయతీ ఆమోదం లేకుండా ఇంత పెద్ద స్థాయి ప్లాంట్ ఎలా నిర్మించారు? అన్న ప్రశ్న లు ఉత్పన్నమవుతున్నాయి. స్థానిక మ హిళలు జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే తక్షణ మే స్పందించి పూర్తి స్థాయి విచారణ జరిపిప్లాంట్‌ను మూసివేయాలనిడి మాండ్ చేస్తున్నారు. లేకపోతే దళిత కాలనీ ప్రజలకు ఇళ్లస్థలాలు కేటా యిం చి సురక్షిత ప్రాంతాలకు తరలించి ప్రా ణాలను కాపాడాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు